

ఏదైనా సమస్య ఎదురైతే, 'ఓం న మః శివాయ' అని జపించండి. ఎ లాంటి ప్రతికూలతనైనా, ఎలాం టి సమస్యలనైనా అధిగమిం చడానికి ఈ ఒక్క మంత్రాన్ని జ పించడం చాలు. మీకు తెలుసా, భక్తితో ఉండటం ఒక వ్యక్తి మా ర్గంలోని అన్ని అడ్డంకులను తొల గిస్తుంది. మీ సేవలో, సాధనలో మరియు సత్సంగంలో నిజాయి తీగా ఉంటే, అన్ని సమస్యలు మాయమవుతాయి మరియు ప్రతికూలత తొలగిపోతుంది. అందుకే 'ఓం నమః శివాయ' మరియు 'మహామృత్యుంజయ' వంటి మంత్రాలు చాలా గొప్పవి. మీ సమస్యలన్నింటినీ మరియు మీకు ఎదురయ్యే ఎలాంటి ప్రతికూలతనైనా అధిగమించే శక్తి వాటికి ఉంది. చాలా మంది ఆ హారం తినే ముందు దానిని ఆ శీర్వదించడం మీరు చూసి ఉం టారు. ఏదైనా చెడు శక్తి ప్రభావం ఉంటే, వారు 'ఓం నమః శివాయ' అని ఆహారాన్ని ఆశీర్వదిస్తారు. మార్గంలో ఉన్నవారికి, జ్ఞానంలో ఉన్నవారికి, ధ్యానం చేసేవారికి 'ఓం నమః శివాయ' జపం చాలా మంచిది, అది మార్గాన్ని సుగ మం చేస్తుంది! 'ఓం' లే దా 'ఓం న మః శివాయ' సానుకూ ల శక్తిని తీసుకురావడానికి సహాయ పడ తాయి.కూర్చుని ఓం నమః శి వా య అని జపించండి. అది గొప్ప మార్పును తెస్తుంది. మీరు అలా చేయండి, నేను ఎల్లప్పుడూ మీ తో ఉంటాను.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ

www.prajadeevena.com

ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 355 | మంగళవారం | 27 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

అధ్యయనం అనంతరం మహాసానుకూల నిర్ణయం

మా ప్రజలపై ప్రతికూల ప్రభావం పడకపోతే '148 మీటర్ల ఎత్తుపై' పునఃసమీక్షకు సిద్ధమే



బ్యారేజీ ఎత్తు పెంపుపై స్వతంత్ర అధ్యయనం చేస్తాం

ఇరు రాష్ట్రాల సీఎస్‌లు, ముఖ్య కార్యదర్శులతో కమిటీ వేద్దాం

బ్యారేజీ ఎత్తు, ముంపు ప్రభావం తదితరాలపై పరిశీలిద్దాం

వాస్తవాలు, అంచనాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుందాం

తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ స్పష్టీకరణ

తెలంగాణకు సహకరించేందుకు అభ్యంతరం లేదని వెల్లడి

ముంబైలో ఇరు రాష్ట్రాల సీఎంల చర్చలు

ఎత్తును 152 మీటర్లకు పెంచేందుకు సమ్మతించండి: సీఎం

ప్రజా దీవెన, హైదరాబాద్ : తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కట్టడానికి తెలంగాణ చేసిన విజప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సానుకూలంగా స్పందించారు. తమ రాష్ట్ర ప్రజలపై ప్రతికూల ప్రభావం పడకపోతే 148 మీటర్ల ఎత్తుకు అంగీకరిస్తూ గతంలో చేసుకున్న ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని

మిగతా 2 లో



న్యాయమూర్తులు నలుగురికి

సీజేలుగా పదోన్నతి

కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తపబ్రత చక్రవర్తి పేరును సిఫారసు చేసిన కొలీజియం

ఢిల్లీ హైకోర్టు సీజేగా తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శాంకోషీ

నలుగురు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి



రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తి రానున్నారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ (సీజే)గా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సోమవారం జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (యాక్టింగ్ సీజే)గా వ్యవహరిస్తున్న జస్టిస్ శాంకోషీని ఢిల్లీ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫారసు చేసింది.

02

అరాచకత్వాన్ని అడ్డుకుంటాం

నవంబర్ 2న ట్యాంక్‌బండ్ వద్ద మహా పాదయాత్ర

హాజరు కానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

వివరాలు 3 లో



రాష్ట్రంలో కరువు పరిస్థితులు, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు.. 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హఠావో' నినాదంతో బీజేపీ వచ్చే నెల 2న ట్యాంక్‌బండ్ వద్ద మహా పాదయాత్ర నిర్వహించనుంది. దీనికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ప్రకటించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

రాష్ట్రం పిచ్చోడిచేతిలో రాయిలా అయ్యింది



కరువు తెచ్చి.. వరి వద్దంటరా?

గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయరు

కృష్ణకు వదిలి కరువు అంటున్నరు

ఈ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలే

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల పోరాటానికి మద్దతు

ఏడాది ఓపిక పడితే.. మళ్లీ వచ్చేది కేసీఆరే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్రంపైకి కరువును తెచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వరి వేయవద్దంటూ రైతులకు సుద్దులు చెప్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని, అన్ని వర్గాలనూ మోసం చేసిండని దుయ్యబట్టారు.

03



ఒక్కసారిగా చలి పంజా



రాత్రివేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

పటాన్‌చెరులో 13 డిగ్రీలు

సీజన్‌లో తొలిసారి 15 డిగ్రీలలోపు

రానున్న రోజుల్లో పెరగనున్న చలి

02

ప్రధాన పాత్రధారి పనిమనిషి



జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ డీజీపీ భార్య హత్య కేసును ఛేదించిన పోలీసులు

మూడు నెలలపాటు కూలీలుగా వేషం మార్చుకొని ప్రత్యేక ఆపరేషన్

ప్రధాన పాత్రధారి పనిమనిషి కల్పన సహా నలుగురి అరెస్టు

వివరాలు వెల్లడించిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్

ప్రధాన సూత్రధారి సునీల్‌పై పీడీయాక్టు పెట్టినట్లు వెల్లడి

02

అలా నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

లేదంటే మీరు చేస్తారా ఉత్తమ్?

సర్కార్‌కు హరీశ్ ఓపెన్ చాలెంజ్

ఎల్లంపల్లికి నీళ్లు తీసుకొస్తామని అబద్ధాలు చెప్తున్నరు

దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల ఎత్తిపోతలపై శ్వేతపత్రం ఇవ్వాలి

మేడిగడ్డ మరమ్మతులు చేపట్టి కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తండి

బీఆర్ఎస్ఎల్పీ నేత హరీశ్ డిమాండ్

02

అధ్యయనం అనంతరం మహాసానుకూల నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై తెలంగాణ ప్రతిపాదన పట్ల గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరిని కనబరిచిందని గుర్తు చేశారు. బ్యారేజీ ఎత్తుపై ఇప్పుడు తెలంగాణ విజ్ఞప్తిని పరిశీలించేందుకు తాము స్వతంత్రంగా అధ్యయనం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. బ్యారేజీ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణం తదితరాలను ఈ అధ్యయనంలో పరిశీలిస్తారని, దానిలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు కలిసి, చర్చించి, పరిశీలిస్తారని వివరించారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుందామని, వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుందామని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో కట్టడానికి అనుమతులకు సంబంధించి మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో సోమవారం చర్చించింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు నిర్మాణంతో ముంపు, ప్రయోజనాలు తదితర అంశాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా, తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని ఫడణవీస్ తెలిపారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని వెల్లడించారు. అయితే, తుది నిర్ణయానికి రావడానికి ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. "సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలి. మహారాష్ట్ర, తమ ప్రజలపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున:పరిశీలించేందుకు అభ్యంతరం లేదు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకూ ఎలాంటి అభ్యంతరం లేదు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం" అని వివరించారు. స్నేహ, సోదర భావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర గతంలో పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తు చేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల వనరుల సంఘం అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని తెలిపారు. ఈలోపు రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖల ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడణవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలని నిర్దేశించారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. గతంలో అనుమతి ఇచ్చిన తర్వాత ముంపు ప్రాంతం మరింత ఎక్కువగా ఉందని గుర్తించామని, అందుకే, ఈసారి సమగ్ర అధ్యయనం తప్పనిసరి అని చెప్పారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు.



రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని, తదుపరి సమావేశాల నిర్వహణ, కాల పరిమితులను నిర్ణయించాలని సూచించారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్దేశించారు.

ఇరు రాష్ట్రాలకూ వారధి ఇది: సీఎం రేవంత్

"తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు. రెండు రాష్ట్రాలనూ భౌతికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుంది. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుంది. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతోపాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టు సాకారం కావడంలో ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల చిరకాల సాగు, తాగునీటి ఆకాంక్షలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ– మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలూ కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాలపరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు.

నీటి పారుదల శాఖ కార్యదర్శులతో ఉమ్మడి కమిటీ

ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో గ్రామాలు ముంపునకు గురికావని, రెండు రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందనే అంశాలపై అధ్యయనం చేయడానికి ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేద్దామని మహారాష్ట్ర సీఎం ప్రతిపాదించగా తెలంగాణ ప్రతినిధి బృందం అంగీకరించింది. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, సాంకేతిక అంశాలపై అధ్యయనం, తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్‌ను ఖరారు చేసింది.

మహారాష్ట్ర నిబంధనల ప్రకారం పరిహారం: మంత్రి ఉత్తమ్

మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు ఆ రాష్ట్ర నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబరు 6న అప్పటి ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, ఎస్బీ చవాన్ మధ్య ఒప్పందం కుదిరిందని, దీనికి కొనసాగింపుగా వివిధ దశల్లో ప్రయత్నాలు జరిగాయని, అయినా, ఆశించిన పురోగతి సాధించలేకపోయామని తెలిపారు. "2016లో 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీ కట్టడానికి ఒప్పందం జరిగింది. కానీ, దీనివల్ల తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవు. గ్రావిటీతో నీటిని తరలించలేము. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం భారీగా పెరుగుతుంది. అందుకే, గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి" అని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకర ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాలపరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఫడణవీస్ జీ.. ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సుకు రండి

'హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబరు 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం. సమ్మిట్‌కు రండి' అని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. సదస్సులో పాల్గొనేందుకు ఆసక్తి ఉందని, హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

నిత్యవసర సరుకుల ధరల నియంత్రణకు టోల్ ఫ్రీ నెంబర్

సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 9281423653కు తెలపాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





ప్రజా దీవెన, నల్లగొండ: ఎల్ నినో దృష్ట్యా నిత్యవసర సరుకుల ధరనులను నియంత్రణలో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వం, నిత్యావసర సరుకుల అమ్మకం దారులపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఎల్ నినో ను సాకుగా తీసుకొని ఎవరైనా నిత్యావసర వస్తువుల ధరలను పెంచినట్లయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు .అంతేకాక "నో స్టాక్" బోర్డులు పెట్టడం, ఉన్న ధరలను పెంచి అమ్మడం, సిండికేట్ గా ఏర్పడి నిత్యవసర సరుకుల ధరలను పెంచినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన " జిల్లా స్థాయి ధరల నియంత్రణ పర్యవేక్షణ కమిటీ" సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను ఎప్పటికప్పుడు నియంత్రణలో ఉంచేందుకు జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. జిల్లాలోని కిరాణా, ఆయిల్, పెట్రోల్, డీజిల్, బియ్యం, పప్పు దినుసులు, తదితర నిత్యవసర వస్తువులను అమ్మే హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు చట్టానికి వ్యతిరేకంగా నిత్యవసర వస్తువుల ధరలను పెంచవద్దన్నారు. ప్రతి ఒక్కరు చట్టబద్ధంగా వ్యవహరించాలని, సామాన్యుడి ధరను, ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యవహరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకవేళ అలా కాకుండా ధరలను పెంచినట్లయితే నిత్యవసర వస్తువుల చట్టం, బ్లాక్ మార్కెటింగ్ చట్టం, నిత్యవసర వస్తువుల నియంత్రణ చట్టం కింద చర్యలు చేపడతామన్నారు. నిత్యావసర వస్తువుల ధరలకు సంబంధించి ఎక్కడైనా చట్ట వ్యతిరేకంగా ధరలు పెంచితే సమాచారం అందించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 9281423653 కు తెలియజేయాలని ఆయన కోరారు. ఎల్ నినో లో జిల్లాలోని హోల్ సేల్ , రిటైల్ వ్యాపారులు ప్రజలకు సహకారం అందించాలని, చట్టబద్ధంగా వ్యవహరిస్తూ నిత్యవసర సరుకులు అమ్మాల్సిన అవసరం ఉందని, ఇందుకు జిల్లా యంత్రాంగానికి అందరూ సహకరించాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,పౌరసరఫరాల డిఎం రామ్ పతి నాయక్, మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ,హార్టికల్చర్ అధికారి శేఖర్, నిత్యవసర సరుకుల అసోసియేషన్ల ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి

నివాళులర్పించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



ప్రజా దీవెన, నల్లగొండ క్రైమ్: నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాల యంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూ లమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానం కలిగిన మహనీయుడని పేర్కొన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించి ప్రపంచానికి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను చాటిచెప్పిన ఆదికవి వాల్మీకి అని కొనియాడారు. ఆయన రచించిన రామాయణం తరతరాలకు స్ఫూర్తినిస్తూ, సమాజానికి నైతిక విలువలను బోధిస్తోందని అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, మనిషి తన జీవితంలో మంచి మార్పును స్వీకరించి ఉన్నతమైన లక్ష్యాలను సాధించవచ్చనే సందేశాన్ని ఆయన జీవితం అందిస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం, క్రమశిక్షణ, నైతిక విలువలను పాటిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహర్షి వాల్మీకి ఆశయాలను, బోధనలను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఏ. ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు,ఎస్బి సీఐ నాగరాజు, ఆర్.ఐలు సంతోష్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీలోకి 10 లక్షలకు పైగా వాహనాలకు నో ఎంట్రీ!

నవంబర్ 1 నుంచి బీఎస్-6 ప్రమాణాలు లేని వాహనాలపై ఆంక్షలు

2027 జనవరి 31 వరకు నిషేధం..కాలుష్య నియంత్రణకు నిర్ణయం

న్యూఢిల్లీ: శీతాకాలంలో ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు బీఎస్-6 ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా లేని ఇతర రాష్ట్రాల్లో రిజిస్టర్ అయిన వాహనాలను నవంబర్ 1 నుంచి ఢిల్లీలోకి అనుమతించరు. ఈ ఆంక్షలు 2027 జనవరి 31 వరకు అమల్లో ఉండనున్నాయి. ఢిల్లీ పరిసర ప్రాంతాలైన గురుగ్రామ్, ఫరీదాబాద్, నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజియాబాద్‌లలోని 10 లక్షలకు పైగా వాహనాలపై ఈ నిర్ణయం ప్రభావం చూపనుంది. రవాణా శాఖ అంచనాల ప్రకారం.. హరియాణాలోని గురుగ్రామ్, ఫరీదాబాద్ జిల్లాల్లో బీఎస్-6 ప్రమాణాలు లేని వాహనాలు దాదాపు 2 లక్షలు ఉన్నాయి. వీటిలో 70 శాతం వరకు బీఎస్-3, బీఎస్-4 వాహనాలే. అలాగే, నోయిడా, గ్రేటర్ నోయిడాలో 4లక్షలకు పైగా వాహనాలు ఈ ప్రమాణాలకు అనుగుణంగా లేవు. ఆంక్షలను అమలు చేసేందుకు ఢిల్లీ సరిహద్దుల్లో తనిఖీలను కఠినతరం చేయనున్నారు. వాహనాల నంబర్ ప్లేట్లను ఆటోమేటిక్‌గా గుర్తించే ఏఎన్‌పీఆర్ కెమెరాలను కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పర్యవేక్షించనున్నారు. ఏఐ ఆధారిత కెమెరాల సాయంతో నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను గుర్తించనున్నారు. బీఎస్-6 ప్రమాణాలు లేని వాహనాలు ఢిల్లీలోకి ప్రవేశించకుండా భౌతిక తనిఖీల ద్వారా కూడా అడ్డుకోనున్నారు.

ఒక్కసారిగా చలి పంజా

రాత్రివేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు

పటాన్‌చెరులో 13 డిగ్రీలు

సీజన్‌లో తొలిసారి 15 డిగ్రీలలోపు

రానున్న రోజుల్లో పెరగనున్న చలి

ప్రజా దీవెన, హైదరాబాద్ :వాతావరణం చల్లబడింది. ఉక్కబోత మాయమైంది. చలి మొదలైంది.. పెరుగుతోంది! రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలిగాలులు వీస్తున్నాయి. అక్కడక్కడా పొగమంచు కురుస్తోంది. కొన్ని రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న మార్పు ఇది. సోమవారం పటాన్‌చెరులో 13 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో 14.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రత 15 డిగ్రీల లోపు నమోదవ్వడం ఇదే తొలిసారి. హైదరాబాద్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 4–5 డిగ్రీల మేర పడిపోయాయి. ఆకాశంలో మబ్బులు లేకపోవడంతో చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటోందని.. రానున్న రోజుల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా తక్కువగా నమోదయ్యాయి. అయితే పగటిపూట మాత్రం చాలా ఎండలు తగ్గలేదు. రాత్రిపూట తట్టుకోలేనంత చలి ఉన్నా పగలు బాగా ఎండ కోడుతోంది. రంగారెడ్డిజిల్లా బాలాపూర్, సరూర్‌నగర్ మేడ్చల్ జిల్లా కీసర, వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో 35 డిగ్రీలకుపైగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నిధుల కోసం నిలదీసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

నియోజకవర్గానికి నిధులు సాధించేందుకు చావడానికైనా సిద్ధమే

నాగర్ కర్నూలు కాంట్రాక్టర్ చనిపోయాకే రూ.5 కోట్ల నిధులిచ్చారు

నిధులివ్వకపోతే 30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్ష చేస్తా

నేను చావాలో, బతకాలో ప్రభుత్వమే నిర్ణయించాలి

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



ప్రజా దీవెన, మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్డు నిర్మాణ పనులకు తాను చస్తేనే నిధులిస్తామంటే చావడానికైనా సిద్ధమని జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రకటించారు. నియోజకవర్గానికి నిధులు సాధించేందుకు చావడానికైనా సిద్ధమేనన్నారు. నాగర్ కర్నూలు జిల్లాలో ఓ ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్ చనిపోయాకే రూ.5 కోట్ల బిల్లులు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. తనకు కూడా చనిపోయాకే ఇవ్వాలని, నియోజకవర్గంలో రూ.40 కోట్ల బకాయిల విషయం తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలోని రాజాపూర్ మండలం కల్లెపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే నిధులు వస్తున్నాయని, మరి రాష్ట్రంలో మిగతా ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. జడ్చర్ల అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని, లేకపోతే 30 వేల మందితో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. ఆమరణ నిరాహార దీక్షలోనే చనిపోతానని, తాను బతకాలో, చావాలో తేల్చాల్సింది ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం బాగుంటుందని, అలా కాకుండా కొన్ని నియోజకవర్గాలకే ప్రాధాన్యం దక్కుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా అంతా ఒక్కటై జడ్చర్ల అభివృద్ధి కోసం పనిచేద్దామని ఆయన పిలుపునిచ్చారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని తెలిపారు. తనకు రాజకీయాల్లో గురువైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, అలాగే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కూడా నిధులు ఇవ్వాలని అడుగుతున్నానని అనిరుధ్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.



న్యాయమూర్తులు నలుగురికి సీజేలుగా పదోన్నతి

కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తపబ్రత చక్రవర్తి పేరును సిఫారసు చేసిన కొలీజియం

ఢిల్లీ హైకోర్టు సీజేగా తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శాంకోషీ

నలుగురు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్ర హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తి రానున్నారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ (సీజే)గా నియమించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. సోమవారం జరిగిన కొలీజియం సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (యాక్టింగ్ సీజే)గా వ్యవహరిస్తున్న జస్టిస్ శాంకోషీని ఢిల్లీ హైకోర్టు సీజేగా నియమించాలని కొలీజియం సిఫారసు చేసింది. గుజరాత్ హైకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ మానశ్ రంజన్ పాఠక్‌ను అదే హైకోర్టు సీజేగా, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్‌సింగ్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా నియమించాలని తీర్మానించింది. మొత్తంగా నలుగురు హైకోర్టు న్యాయమూర్తులకు సీజేలుగా పదోన్నతి కల్పిస్తూ కొలీజియం సిఫారసులు చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం వీరు పదవీబాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, తెలంగాణ హైకోర్టు సీజేగా ఉన్న జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్ ఈ నెల మొదట్లో పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా వెళ్లారు. దీంతో హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి అయిన జస్టిస్ శాంకోషి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. కొలీజియం తాజా సిఫారసుతో త్వరలో పూర్తిస్థాయి సీజే రానున్నారు.

న్యాయవాదుల కుటుంబంలో జననం

జస్టిస్ తపబ్రత చక్రవర్తి 1967లో కోల్‌కతాలో న్యాయవాదుల కుటుంబంలో జన్మించారు. న్యాయశాస్త్ర విద్యను పూర్తిచేసిన తర్వాత 1991లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. రాజ్యాంగ సంబంధిత, సివిల్ కేసుల్లో విస్తృతంగా ప్రాక్టిస్ చేశారు. 2013 అక్టోబరు 30వ తేదీన కలకత్తా హైకోర్టు అదనపు జడ్జిగా, 2016 మార్చి 14న శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ సుజోయ్‌పాల్ పదవీ విరమణ అనంతరం కలకత్తా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఈ ఏడాది సెప్టెంబరు 7వ తేదీ వరకు బాధ్యతలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్‌లో 32 వేల మంది ఉపాధ్యాయుల నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టేసిన డివిజన్ బెంచ్‌లో జస్టిస్ తపబ్రత చక్రవర్తి సభ్యుడిగా ఉన్నారు.

ప్రధాన పాత్రధారి పనిమనిషి

జూబ్లీహిల్స్‌లో రిటైర్డ్ డీజీపీ భార్య హత్య కేసును చేధించిన పోలీసులు

మూడు నెలలపాటు కూలీలుగా వేషం మార్చుకొని ప్రత్యేక ఆపరేషన్

ప్రధాన పాత్రధారి పనిమనిషి కల్పన సహా నలుగురి అరెస్టు

వివరాలు వెల్లడించిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్

ప్రధాన సూత్రధారి సునీల్‌పై పీడీయాక్టు పెట్టినట్లు వెల్లడి

ప్రజా దీవెన, హైదరాబాద్ : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో 5 నెలల క్రితం విశ్రాంత డీజీపీ అధికారి రాయ్ వినయ్ రంజన్ నివాసంలో దోపిడీకి పాల్పడటంతో పాటు.. ఆయన భార్య తనూజను హత్య చేసిన నేపాల్ దొంగల ముఠాను హైదరాబాద్ సిటీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన పాత్రధారి అయిన పనిమనిషి ధర్మ అలియాస్ కల్పనతోపాటు గణేష్ బిశ్వకర్మ, చంద్ర బహదూర్ తమంగ్, గణేష్ బహదూర్ షాహీలను అరెస్టు చేసినట్లు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సోమవారం ఐసీసీసీలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తెలిపారు. హత్య జరిగిన పదిరోజులకు ప్రధాన సూత్రధారి అయిన సునీల్ బహదూర్‌తో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన దిలీప్ బహదూర్‌లను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి26 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాజాగా అరెస్టయిన వారి నుంచి రూ.51,130 నగదుతో పాటు.. కొంత బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సజ్జనార్ తెలిపారు. ప్రధాన నిందితుడు సునీల్‌పై పీడీయాక్టు నమోదు చేసినట్లు చెప్పారు. వినయ్‌రంజన్ రాయ్ ఇంట్లో పని మనిషిగా చేరిన కల్పన.. తన ప్రియుడు సునీల్‌తో కలిసి కుట్రపన్ని మే 7న అర్ధరాత్రి ఈ హత్య, దోపిడీకి పాల్పడిందని వెల్లడించారు. తన గ్యాంగుతో కలిసి ఇంట్లో దోపిడీకి పాల్పడుతున్న సమయంలో తనూజ నిద్రలేవటంతో నిందితులు ఆమె నోట్లో గుడ్డలు కుక్కి, చేతులు కట్టేసిన నోటికి, ముక్కుకు ప్లాస్టర్ వేశారు. దాంతో ఊపిరి ఆడక తనూజ మృతి చెందింది. నిందితులు ఇంట్లోని 225 గ్రాముల బంగారం తీసుకొని పరారయ్యారు. నాంపల్లి స్టేషన్‌లో రైలు ఎక్కి కాజీపేటలో దిగి దోచేసిన సొత్తును పంచుకొని ఎవరి దారిన వారు పారిపోయారు. పోలీసులు అప్రమత్తమయ్యేలోపు నేపాల్‌కు చేరుకున్నారు.

కూలీల వేషంలో మూడు నెలల ఆపరేషన్

ఈ ముఠాను పట్టుకొనేందుకు సజ్జనార్ మే-19న ప్రత్యేక దర్యాప్తు బృందం 'సిట్'ను ఏర్పాటు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సిట్‌లో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, 16 మంది కిందిస్థాయి పోలీసులు ఉన్నారు. ఈ బృందం బెంగళూరు, ముంబై, పుణె, సూరత్, పట్నా, ఢిల్లీ, లక్నో, ఉత్తరాఖండ్ తదితరప్రాంతాల్లో నిందితుల కోసం విస్తృతంగా గాలించింది. భారత్-నేపాల్ సరిహద్దులో దాదాపు 5 నెలలకు పైగా క్యాంప్ చేశారు. 3 నెలలపాటు కూలీలుగా మారు వేషాలు వేసుకొని అక్కడి మనుషుల్లో కలిసిపోయారు. కొండ ప్రాంతాలు, సుదూర గ్రామాలలో తిరుగుతూ నిందితుల సమాచారం సేకరించారు. దోలాఖా, దైలేఖ్, కైలాలీ జిల్లాల్లో నిందితులు ఉన్నట్లు గుర్తించారు. ఇదేమీ తెలియని నిందితులు మరోసారి దోపిడీకి పాల్పడేందుకు ఒక్కొక్కరుగా తిరిగి ఇండియాకు చేరుకున్నారు. కల్పన పుణెలోని తన కుమారుడి వద్దకు వెళ్లటంతో ఆమెను పోలీసులు అనుసరించారు. బెంగళూరు, గురుగ్రామ్‌లలో దోపిడీకి ఈ ముఠా పథకం వేసినట్లు గుర్తించి వెంటనే అరెస్టు చేసినట్లు సజ్జనార్ తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్రలలో 8 దోపిడీ కేసుల్లో నిందితుడైన జీవన్ చంద్ అలియాస్ జిబన్‌ను కూడా సిట్ బృందం అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. నేపాల్ నుంచి వచ్చి దోపిడీలే లక్ష్యంగా ఇళ్లల్లో పనివారు, వంట మనుషులు, వాచ్‌మెన్లు, కేర్‌టేకర్లుగా చేరుతున్న కొన్ని ముఠాలు.. యజమానులను నమ్మించడానికి నేపాల్ సిటిజన్ కార్డులో ఉన్న పేరును కొద్దిగా మార్చి నకిలీ ఆధార్‌కార్డులు సృష్టిస్తున్నట్లు చెప్పారు. పనిలో చేర్చుకునే ముందు గుర్తింపు కార్డులను తీసుకోవడమే కాకుండా, యూపీఐ లేదా ఇతర మార్గాల ద్వారా వారి అసలు పేరును నిర్ధారించుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే 100 లేదా 112కు కాల్ చేయాలని, హైదరాబాద్ సిటీ పోలీస్ వాట్సాప్ హెల్ప్‌లైన్ 94906 16555కు మెసేజ్ కూడా చేయవచ్చని తెలిపారు.

రాష్ట్రం పిచ్చోడిచేతిలో రాయిలా అయ్యింది

కరువు తెచ్చి.. వరి వద్దంటరా?

గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయరు

కృష్ణకు వదిలి కరువు అంటున్నరు

ఈ ప్రభుత్వం ఏ వర్గానికీ న్యాయం చేయలే

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పోరాటానికి మద్దతు

ఏడాది ఓపిక పడితే.. మళ్లీ వచ్చేది కేసీఆరే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజా దీవెన, రాజన్న సిరిసిల్ల : గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయకుండా రాష్ట్రంపైకి కరువును తెచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వరి వేయవద్దంటూ రైతులకు సుద్దులు చెప్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ రాష్ట్రం పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏ ఒక్క వర్గానికీ న్యాయం చేయలేదని, అన్ని వర్గాలనూ మోసం చేసిండని దుయ్యబట్టారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం అసెంబ్లీలో నిలదీస్తామని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ సోమవారం పర్యటించారు. మొదట గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. తర్వాత సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్‌లో అంబా భవానీ మండపంలో పూజలు చేశారు. అనంతరం సిరిసిల్లలోని జిల్లా ప్రభుత్వ దవాఖానలో రూ.30 లక్షల విలువైన అత్యవసర వైద్య సేవల పరికరాలను ప్రారంభించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో కుమ్రం భీం వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు కలిశారు. తాము 14 రోజులుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించడం లేదని గోడు వెళ్లబోసుకున్నారు. ఉద్యోగుల పోరాటానికి అండగా ఉంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఇది మూర్ఖపు ప్రభుత్వమని, మీకిచ్చిన హామీలు అమలు చేస్తాడని నమ్మకం లేదన్నారు. మరో ఏడాదిన్నర ఓపిక పడితే మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, అప్పటి వరకు ఓపిక పట్టాలని కోరారు.

రాబోయేది కేసీఆర్ ప్రభుత్వమే

అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేసిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఉద్యోగులకు ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని, మూడేండ్లలో ఏడు డీఏలు బాకీ ఉన్నాడని మండిపడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా పీఆర్సీలు అందించారని గుర్తుచేశారు. ప్రస్తుతం గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిందికి కృష్ణకు గోదావరి నీళ్లు వదిలిపెట్టి ఇప్పుడు కరువు అంటూ కథలు చెప్తున్నాడని విమర్శించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ కట్టిందే నీళ్ల కోసమని, దానిని మూడేండ్లుగా బదనాం చేసి నీళ్లు ఎత్తిపోయడం లేదని అన్నారు. రాబోయే ప్రభుత్వం అన్ని వర్గాలకు, ఉద్యోగులకు కావాల్సిన అవసరాలను అడగకుండా తెలుసుకొని అమలు చేస్తుందని చెప్పారు. ఒక్క సంవత్సరం ఓపిక పట్టాలని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని ధీమా వ్యక్తంచేశారు.

ఇది మూర్ఖపు ప్రభుత్వం

ప్రస్తుతం రాష్ట్రంలో కరువు ఉన్నదని ముఖ్యమంత్రే చెప్తున్నారని, మళ్లీ మూసీ సుందరీకరణ అంటూ సోకులు పడడానికి వేల కోట్ల రూపాయలకు టెండర్లు పిలుస్తున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. గతంలో రోమ్ నగరం తగలబడుతుంటే చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి పేదలు, చిరుద్యోగులు, వాళ్లకు ఇచ్చిన హామీలపై పట్టింపు, సోయి లేదని అన్నారు.

సిరిసిల్ల దవాఖానకు 30 లక్షల వైద్య పరికరాలు

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు కేటీఆర్ చొరవతో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల ద్వారా దాదాపు రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూర్చగా.. సోమవారం వాటిని ఆయన ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఎగదండి మేఘనకు మెరుగైన వైద్యం కోసం అయ్యే ఖర్చులు భరిస్తానని హామీ ఇచ్చారు. పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మేఘన ఆహారం కూడా తీసుకోలేని స్థితికి చేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రానికి చెందిన గుగులోత్ జశ్వంత్‌కు కేటీఆర్ గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

అలా నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

లేదంటే మీరు చేస్తారా ఉత్తమ్?

సర్కార్‌కు హరీశ్ ఓపెన్ చాలెంజ్

తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తీసుకొస్తామని అబద్ధాలు చెప్తున్నరు

దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల ఎత్తిపోతలపై శ్వేతపత్రం ఇవ్వాలి

మేడిగడ్డ మరమ్మతులు చేపట్టి కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తండి

బీఆర్ఎస్‌ఎల్పీ నేత హరీశ్ డిమాండ్



ప్రజా దీవెన, హైదరాబాద్ : మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓపెన్ చాలెంజ్ విసిరారు. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని కాంగ్రెస్ సర్కార్ నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని, లేకపోతే నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రిజైన్ చేస్తా రా? అని బీఆర్ఎస్‌ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు సవాల్ చేశారు. గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని ప్రభుత్వం అబద్ధాలు చెప్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ ప్రతిపాదనకు సంబంధించిన డీపీఆర్‌ను బహిర్గతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సు మన్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, గట్టు రామచందర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కరువుకు కాంగ్రెస్ వైఫల్యమే కారణమని, 'ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని పునరుద్ఘాటించారు. నీళ్లు కొనలేమని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, అందుబాటు లో ఉన్న నీటిని ఎందుకు ఎత్తిపోసి రైతులను ఎందుకు ఆదుకోవడం లేదని ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి నీటికి ఎందుకు నిర్లక్ష్యంగా కిందికి వదిలేశారని నిలదీశారు.

ఏపీలో క్రాప్‌హాలిడే ఎందుకు లేదు?

ఇక్కడి ప్రభుత్వం అప్పనంగా వదిలేసిన నీళ్లను ఏపీ సర్కార్ ఒడిసిపట్టి పంటలు పండించుకుంటున్నదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఏపీలోని పట్టిసీమ లిఫ్ట్ వంద రోజులు నీళ్లు ఎట్లా ఎత్తింది? దానిపై ఉన్న దేవాదుల ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఎత్తలేదు? అని ప్రశ్నించారు. 33శాతం లోటు వర్షపాతం ఉన్న ఏపీలో క్రాప్‌హాలిడే ఎందుకు లేదు.. 17శాతం మాత్రమే లోటు వర్షపాతం నమోదైన తెలంగాణలో ఎందుకు ఉన్నది? అని నిలదీశారు. దేవాదులను సక్రమంగా నడిపి ఉంటే వరంగల్ జిల్లా, కరీంనగర్ జిల్లాలోని కొంతభాగం సస్యశ్యామలంగా మారేదని హరీశ్‌రావు గుర్తుచేశారు. శ్రీశైలంలో నీరు అందుబాటులో ఉన్నప్పుడు 24/7 ఎత్తిపోసి పంటలను కాపాడేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో ఐదు మోటర్లకు గాను రెండింటినే ఎందుకు నడుపుతున్నారని, 12 గంటలు ఆన్, 12గంటలు ఆఫ్ ఎందుకు చేస్తున్నారని నిలదీశారు.

మేడిగడ్డకు మరమ్మతులు చేయండి

ప్రభుత్వం తక్షణమే మేడిగడ్డకు మరమ్మతులు చేపట్టి, కన్నెపల్లి పంపుహౌస్ మోటర్లను నడిపి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తమ్మిడిహట్టి నుంచి నీటిని తీసుకొచ్చేందుకు రూ.25 వేల కోట్లు ఖర్చు చేస్తామని ప్రభుత్వం చెప్తున్నదని, అకడినుంచి సుందిళ్లకు నీటిని తరలించే ప్రతిపాదనలో ఆయకట్టు ఎంత ఉన్నదో వెల్లడించాలని కోరారు. ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఆ ఖర్చు రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లకు చేరే అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణానికి తమకు అభ్యంతరం లేదని, అది ఆచరణసా ధ్యమో కాదో కాలమే నిర్ణయిస్తుందన్నారు.

పదేండ్లుగా కాంగ్రెస్ కాలయాపన

బీఆర్ఎస్ పార్టీ అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకున్నదని, తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత లేదని మూడు లేఖల ద్వారా తేలిన తర్వాతే మేడిగడ్డకు వెళ్లాల్సి వచ్చిందని హరీశ్ చెప్పా రు. 2014లో అధికారంలోకి వచ్చిన 42 రో జుల్లోనే మహారాష్ట్ర ప్రభుత్వంతో అనేకమార్లు చర్చలు జరిపామని గుర్తుచేశారు. తొలి ఆరు నెలల్లో అర డజన్ మీటింగులు పెట్టామని, నాడు మహారాష్ట్రలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ తో, బీజేపీ ప్రభుత్వం ఉంటే వెళ్లి అడిగామని ఎంత చెప్పినా 152 మీటర్లకు ఒప్పుకోలేదని వివరించారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన 1054 రోజుల తర్వాత మొదటి మీ టింగ్‌కు వెళ్లారని విమర్శించారు. 2007లో ప్రారంభమైన ప్రాజెక్టు 2014 దాకా ఏం చేశారని, మూడు చోట్ల కాంగ్రెస్ అధికారంలో ఉన్నా 152 మీటర్లకు ఒప్పించలేదని, నాడు ఏడేండ్లు, నేడు మూడేండ్లు కాలయాపన చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తల దగ్గర కా కుండా తోక దగ్గర పనులు చేసి మొబిలైజ్ అ డ్వాన్సుల పేరిట బిల్లులు ఎత్తారని మండిపడ్డారు. తమకు రాజకీయాలు కాదని, రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యమని స్పష్టంచేశారు.

హరీశ్‌కు తుమ్మిడిహట్టి భయం పట్టుకుంది!

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత

తాజా అంచనా 217.96 టీఎంసీలు

తాజా అధ్యయనంలో.. సుందిళ్ల వరకు గ్రావిటీ మార్గం పరిశీలన

ప్రభుత్వ విప్ విజయరమణారావు

ప్రజా దీవెన, హైదరాబాద్ : తుమ్మిడిహట్టి ఎత్తు పెంచడానికి మహారాష్ట్ర ఒప్పుకుంటుందేమోనని హరీశ్‌రావుకు భయం పట్టుకుందని ప్రభుత్వ విప్ విజయరమణారావు విమర్శించారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు సఫలమై.. ఆదిలాబాద్, కరీంనగర్ సహా ఇతర జిల్లాలకు మేలు జరిగితే బీఆర్ఎస్ అడ్రస్ గల్లంతవుతుందన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో ఏర్పడిందన్నారు. అందుకే హరీశ్‌రావు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిన ప్రాజెక్టును తిరిగి పట్టాలెక్కించడానికి చేస్తున్న ప్రయత్నాలు చూసి ఓర్చుకోలేకపోతున్నారన్నారు.రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం... కూలేశ్వరం అయినా హరీశ్‌రావులో మార్పు రాలేదన్నారు. మహారాష్ట్రతో చర్చలు జరపడానికి బీఆర్ఎస్ ప్రభుత్వానికి 42 రోజులే పట్టిందంటున్న ఆయన.. 2016లోనే ఒప్పందం చేసుకుని 2023 వరకు తుమ్మిడిహట్టిని ఎందుకు గాలికి వదిలేశారో చెప్పాలన్నారు. 148 మీటర్ల ఎత్తులో నిర్మాణ ఒప్పందంపై సంతకం చేసింది కేసీఆరే అన్నారు. తాజా లెక్కల ప్రకారం తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత 217.96 టీఎంసీలు ఉంటే.. అసలు నీళ్లే లేవంటూ పాత లెక్కలు పట్టుకుని ఎందుకు అడ్డుకుంటున్నారంటూ హరీశ్‌రావును నిలదీశారు. ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు డిజైన్‌లో ఎల్లంపల్లి వరకు 100 కి.మీ. గ్రావిటీ కాలువ, 16 కి.మీ. సొరంగం ప్రతిపాదించారని, తాజా అధ్యయనంలో సుందిళ్ల వరకు గ్రావిటీ మార్గాన్ని పరిశీలించారని పేర్కొన్నారు. ఈ రెండు దశల్లో లిఫ్టింగ్ ఖర్చు తగ్గించుకునేందుకు అవకాశం ఉందన్నారు. "తుమ్మిడిహట్టిపై సీఎం రేవంత్ మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశారు. కేంద్ర జల్‌శక్తి మంత్రిని కలిశారు. సీడబ్ల్యూసీతో చర్చలు జరిపారు. తాజా సాంకేతిక నివేదికలు సమర్పించారు. ఇప్పుడు ఫడ్నవీస్‌ను నేరుగా కలిశారు. స్వతంత్ర అధ్యయనం, సంయుక్త కమిటీ ఏర్పాటుకు మహారాష్ట్ర సానుకూలంగా స్పందించింది. ఇది కాలయాపన ఎలా అవుతుంది?" అంటూ హరీశ్‌రావును ప్రశ్నించారు.

ఫారం-6లో ఏ మార్పూ చేయలేదు

మార్చే అధికారం కేంద్రానికి మాత్రమే ఉంది
సర్‌పై నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవే
పత్రిక కథనం ఆధారంగా ఈసీపై నింద సరికాదు
వార్తా కథనం సాక్ష్యంగా చెల్లదు
ఈఆర్‌వో అనుమతి లేకుండా
ఈసీఐనెట్‌లో ఓట్ల చేర్పు, తొలగింపు కుదరదు
సుప్రీంకోర్టులో కేంద్ర ఎన్నికల సంఘం అఫిడవిట్



న్యూఢిల్లీ: కొత్త ఓటర్ల నమోదు కోసం తప్పనిసరి అయిన ఫారం -6లో ఎలాంటి మార్పులూ చేయలేదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ ఏకపక్షంగా కీలక నిర్ణయాలన్నీ తీసుకుంటున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు సంబంధించి కమిషన్ నిర్ణయాలన్నీ సమష్టిగా తీసుకున్నవేనని స్పష్టంచేసింది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానంలో సోమవారం అఫిడవిట్ దాఖలు చేసింది. ఈసీలు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషీలు అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోకుండా సీఈసీ కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించటంతో దేశవ్యాప్తంగా దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ వార్తా కథనం ఆధారంగా రాకేశ్‌కుమార్‌సింగ్ అనే వ్యక్తి సుప్రీంకోర్టులో కోవారెంటో రిట్‌ను దాఖలు చేశారు. ఏ అధికారంతో సీఈసీ సొంతంగా నిర్ణయాలు తీసుకున్నారో వివరణ కోరాలని అభ్యర్థించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఈసీలో నిర్ణయాలు ఏకగ్రీవంగా అయినా, లేదంటే మెజారిటీ ప్రకారం తీసుకోవాలని గుర్తుచేశారు. ఎస్ఐఆర్‌పై కమిషన్ తీసుకున్న నిర్ణయాలన్నీ చెల్లవని ప్రకటించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. వివరణ ఇవ్వాలని ఈసీని ఈ నెల 5న ఆదేశించింది. దీంతో 15 అంశాలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌ను ఈసీ సోమవారం దాఖలు చేసింది. ఇదే అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతోపాటు మరికొందరు కూడా పిటిషన్లు దాఖలు చేశారు. వాటన్నింటిని కలిపి ధర్మాసనం విచారించనుంది. ఒక వార్తా సంస్థ ప్రచురించిన కథనం న్యాయస్థానంలో సాక్ష్యంగా చెల్లదని ఈసీ తన అఫిడవిట్‌లో వాదించింది. వార్తా కథనం ఆధారంగా ఈసీ విశ్వసనీయతను ప్రశ్నించటం సరికాదని పేర్కొంది.

అఫిడవిట్‌లో ఈసీ పేర్కొన్న అంశాలు..

ఈ అఫిడవిట్‌ను సీఈసీ, ఇద్దరు ఈసీల ఏకగ్రీవ ఆమోదంతో దాఖలుచేశారు. 2025 జూన్, అక్టోబరు, 2026 మేలో ఎస్ఐఆర్‌పై విడుదల చేసిన మూడు ఆదేశాలూ ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయాల ఆధారంగా జారీచేసినవే అన్నారు.

ఒక ఫైలుపై చర్చ సమయంలో ఈసీలు, సీఈసీ ఇచ్చే నోట్స్, సలహాలు, వ్యక్తంచేసే అభ్యంతరాలు కమిషన్ నిర్ణయాలుగా పరిగణించబడవు.

ఒక అంశానికి సంబంధించిన ఫైలు మొదట ఒక కమిషనర్ వద్దకు వెళ్తుంది. అటు నుంచి మరో కమిషనర్ వద్దకు వెళ్తుంది. చివరగా సీఈసీ వద్దకు వెళ్తుంది. అత్యవసర సమయాల్లో ఎలక్ట్రానిక్ మాధ్యమంలో నిర్ణయాలు తీసుకొని, ఆ తర్వాత వాటిని రికార్డు చేస్తారు. ఈసీలో తన పరిధిని దాటి ఏ అధికారి ఆదేశాలిచ్చినా శిక్షను ఎదుర్కొంటారు. డిప్యూటేషన్‌పై ఉన్న అదనపు కార్యదర్శి జూలై 28న ఇచ్చిన ఆదేశాలను వ్యతిరేకిస్తూ ఇద్దరు ఈసీలు కేంద్ర క్యాబినెట్ కార్యదర్శికి లేఖ రాశారు. జూలై 30 ఇద్దరు ఈసీలు సంయుక్తంగా ఇచ్చిన ఆదేశాల వల్ల అదనపు కార్యదర్శి జారీచేసిన ఆదేశాల అమలు నిలిచిపోయింది. ఫారం-6లో ఈసీ ఎలాంటి మార్పులూ చేయలేదు. అందులో మార్పులు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంది. ఎస్ఐఆర్ డిక్లరేషన్ ఫారం -6లో భాగం కాదు. అది ప్రత్యేకమైన పత్రం.

ఎస్ఐఆర్ డిక్లరేషన్ కూడా ఫారం-6లో భాగమనే అభిప్రాయం ఏర్పడినందున ఈ నెల 21 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల్లో ఈ రెండిండిని విడిగా చూపుతున్నాం. భౌతికంగా కూడా ఈ రెండు పత్రాలు వేర్వేరుగా ఉంటాయి.

ఓటర్ల జాబితాలో మ్యాపింగ్ కాని ఓటర్లు ఎన్నికల అధికారుల వద్ద విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదు. బీఎల్‌వోలే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి తగిన పత్రాలు స్వీకరిస్తారు. అసాధారణ కేసుల్లో మాత్రమే విచారణ ఉంటుంది. ఈసీఐనెట్‌లో ఈఆర్‌వో అనుమతి లేకుండా ఓటరు నమోదుకానీ, తొలగింపు కానీ సాధ్యం కాదు. అయినా దీనిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఐఐటీ, ఐఐఎంసీ నిపుణులతో కమిటీని ఏర్పాటు చేశాం. గోవాకు చెందిన 97 మంది పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేయని ఘటనపై చర్యలు తీసుకున్నాం. వారిలో 88 మంది ఇప్పటికే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఆరుగురు విదేశాల్లో ఉన్నారు. ముగ్గురికి పోర్చుగీసు పాస్‌పోర్టులు ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లో కొత్తగా ఓటరు జాబితాలో పేర్లు చేర్చటంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు ఆ రాష్ట్ర ఎన్నికల సీఈవో వద్ద అప్పీళ్లు దాఖలు చేశారు. అయితే, ఈ అంశం ఈసీ వద్దకు రాలేదు. సీఈసీని విధుల నుంచి తప్పించాలన్న పిటిషన్‌కు విచారణార్హత లేదు. సీఈసీని పదవి నుంచి తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఎలాగైతే తొలగిస్తారో అలాంటి ప్రక్రియే ఉంటుంది. మీడియాకు కమిషన్ ఎలాంటి అంతర్గత నోట్‌ను విడుదల చేయలేదు. నోట్ విడుదలకు అనుమతి కూడా ఇవ్వలేదు.

అలా చెప్పండి అరనిమిషంలో ఆపేస్తాం

ఢిల్లీ వ్యాపారులకు రాహుల్ గాంధీ సూచన
అర నిమిషంలోనే నిరసనలు నిలుస్తాయని వ్యాఖ్య



న్యూఢిల్లీ : 'ఓట్ చోరీ'కి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండీ బ్లాక్ నవంబరు 1న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ నిరసనకు సిద్ధమవుతోంది. అయితే, దీపావళి, ధన్‌తేరస్ వంటి పండుగల నేపథ్యంలో ఈ నిరసన కారణంగా తమ వ్యాపారాలు దెబ్బతింటాయని పేర్కొంటూ వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దాదాపు రూ.25 వేల కోట్ల మేరకు వ్యాపారాలు ప్రభావితం అవుతాయని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇండీ నిరసనను వాయిదా వేయాలని కోరుతున్నాయి. ఈ విజ్ఞప్తిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ఓట్ చోరీ 4వ నిందితుడు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఆ పదవి నుంచి తొలగించాలని ప్రధాని మోదీకి చెప్పండి. అర నిమిషం(30 సెకన్ల)లోనే నిరసనలు ఆగిపోతాయి" అని పేర్కొన్నారు. "ఢిల్లీలోని ప్రతి వ్యాపారి పట్ల మాకు ప్రేమ ఉంది. మీ మాట వింటాం. ప్రభుత్వం మెట్రోను మూసేసింది. రహదారులను దిగ్బంధించింది. మన రాజధానిని లాక్ డౌన్ చేసింది. ఓట్ల దొంగతనం అనేది ఎవరికీ క్షేమం కాదు. మీ దుకాణాలు, మీ పొదుపు, మీ చిన్నారుల భవిష్యత్తుకు కూడా గొడ్డలి పెట్టు. అందుకే.. జ్ఞానేశ్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని మోదీని కోరండి" అని రాహుల్ అన్నారు.

ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో 100శాతం ఇథనాల్!

ఈ100 ఇంధన వినియోగానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్
మోటారు వాహన నిబంధనల్లో సవరణలు
ప్రత్యేకంగా రూపొందించిన వాహనాలకే అనుమతి



న్యూఢిల్లీ : పెట్రోల్ అవసరం లేకుండా పూర్తిగా ఇథనాల్‌తో నడిచే కార్లు రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లో ఈ100 ఇంధనం (100శాతం ఇథనాల్) వాడేందుకు అనుమతిస్తూ కేంద్ర రవాణా శాఖ సోమవారం మోటారు వాహన నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో అధిక ఇథనాల్ మిశ్రమాలతో నడిచే కార్ల తయారీ, ధ్రువీకరణకు చట్టపరంగా మార్గం సుగమం అయినట్లయింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడానికే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ100 ఇంధనానికి అనుమతి లభించినంత మాత్రాన ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న అన్ని పెట్రోల్ కార్లలో ఈ ఇంధనాన్ని వాడేందుకు వీలుండదు. తయారీ సంస్థలు ప్రత్యేకంగా రూపొందించి, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ధ్రువీకరించిన ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల్లోనే ఈ100 లేదా ఈ85 ఇంధనాన్ని వినియోగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ20 పెట్రోల్‌కు అనుగుణంగా ఉన్న కార్లలో, సాధారణ పెట్రోల్ వాహనాల్లో నేరుగా ఈ100 ఇంధనాన్ని నింపడానికి అనుమతి లేదు. అధిక ఇథనాల్ శాతాన్ని తట్టుకునేలా ఇంజన్, ఇంధన సరఫరా వ్యవస్థలను ప్రత్యేకంగా రూపొందించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో ఉన్న ఈ20 పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్, 80శాతం పెట్రోల్ ఉంటాయి. తాజాగా నిబంధనల్లో చేసిన మార్పులతో ఈ85తోపాటు ఈ100 ఇంధనాన్నీ అధికారికంగా చేర్చారు. ఈ85లో 85శాతం ఇథనాల్, 15శాతం పెట్రోల్ ఉంటాయి. ఈ100లో దాదాపు పూర్తిగా ఇథనాలే ఇంధనంగా ఉంటుంది. కాగా, వాహనాల ఉద్గార ప్రమాణాలు, ఇంధన నిర్దేశాలు, పరీక్షా విధానాలకు సంబంధించిన నిబంధనల్లోనూ మార్పులు చేశారు. తేలికపాటి పెట్రోల్, డీజిల్ వాహనాల స్థూల బరువు పరిమితిని 3,000 నుంచి 3,500 కిలోలకు పెంచారు.

రంగంలోకి ఆటోమొబైల్ కంపెనీలు

అధిక ఇథనాల్ మిశ్రమాలతో నడిచే వాహనాల తయారీపై ఆటోమొబైల్ సంస్థలు ఇప్పటికే దృష్టి సారించాయి. మారుతీ సుజుకీ ఈ ఏడాది జూన్‌లో ఈ20 నుంచి ఈ100 వరకు ఇంధన మిశ్రమాలతో నడిచే వ్యాగనార్ ఫ్లెక్స్ ఫ్యూయల్ కారును పరిచయం చేసింది. టయోటా, టాటా మోటార్స్, హ్యుందాయ్ వంటి సంస్థలు కూడా ఈ తరహా వాహనాల రూపకల్పనపై పనిచేస్తున్నాయి. చమురు దిగుమతుల భారం తగ్గించడమే లక్ష్యంగా ఇథనాల్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. అయితే, ఈ100 ఇంధనాన్ని వాణిజ్య స్థాయిలో ఎప్పటి నుంచి, ఏయే ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తారనే దానిపై తాజా ప్రకటనలో నిర్దిష్ట గడువు వెల్లడించలేదు.

అరాచకత్వాన్ని అడ్డుకుంటాం

నవంబర్ 2న ట్యాంక్‌బండ్ వద్ద మహా పాదయాత్ర
హాజరు కానున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

ప్రజా దీవెన, హైదరాబాద్ : రాష్ట్రంలో కరువు పరిస్థితులు, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు.. 'లోక్‌తంత్ర బచావో.. అరాచకత హఠావో' నినాదంతో బీజేపీ వచ్చే నెల 2న ట్యాంక్‌బండ్ వద్ద మహా పాదయాత్ర నిర్వహించనుంది. దీనికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ప్రకటించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "రాష్ట్రవ్యాప్తంగా 300 మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. 5వేలకు పైగా చెరువులు ఎండిపోయాయి. రాజధానిలో ట్యాంకర్‌ల ద్వారా ప్రజలు తాగునీరు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కరువు తీవ్రత ఇంత ఆందోళనకరంగా ఉంటే, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఢిల్లీకి వెళ్లి 'సర్'పై నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉంది'" అని రాంచందర్‌రావు అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ముగింపు దశకు చేరినా, కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నారని మండిపడ్డారు. "మీ సొంతూరు కొండారెడ్డిపల్లికే వస్తా. టైం చెప్పండి. అర్హుల ఓట్లు ఎన్ని తొలగించారో నిరూపించండి" అని సీఎం రేవంత్‌కు రాంచందర్‌రావు సవాల్ చేశారు. రాహుల్‌ను ప్రధానిని చేస్తామన్న రేవంత్ ప్రకటనను జోక్‌గా అభివర్ణించారు. రాహుల్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంఖ్య 1182 నుంచి 660కి పడిపోయిందన్నారు. కాగా, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఏ అవార్డు ఇచ్చినా మూడు రాష్ట్రాలు గౌరవించాలని రాంచందర్‌రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) ఎప్పుడూ అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ తల్లిదండ్రులపై కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు.

ట్రిబ్యునల్ స్టేపై పిటిషన్ కొట్టివేత

సీతమ్మ సాగర్ ఇసుక తవ్వకాలపై జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరణ
ట్రైబ్యునల్ విధించిన స్టేపై పిటిషన్ కొట్టివేత

ప్రజా దీవెన, న్యూఢిల్లీ : సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పరిధిలో డీ సిల్టేషన్ పేరుతో చేపడుతున్న ఇసుక తవ్వకాల అంశాన్ని జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ)లోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలపై ఎన్జీటీ విధించిన స్టే వ్యవహారంపై కలుగజేసుకోవడానికి నిరాకరించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం మండలంలో సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో ములుగు జిల్లాలో 55 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం ముంపునకు గురవుతున్నది. ఈ ప్రాంతంలో గోదావరి నుంచి ఇసుకను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే, ఇది పర్యావరణ నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ పూనెం రాములు సహా మరికొందరు ఎన్జీటీని ఆశ్రయించారు. దీంతో వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ ప్రభుత్వం, టీజీఎండీసీ, ములుగు కలెక్టర్ సహా ఇతరులకు ఎన్జీటీ నోటీసులు జారీ చేసింది. అప్పటి వరకూ ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని ఆదేశిస్తూ మధ్యంతర స్టే విధించింది. ఎన్జీటీ ఉత్తర్వులను ఈనెల 1న తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీఎండీసీ)సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సీజేఐ, జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఎన్జీటీలో తదుపరి విచారణ నవంబరు 5వ తేదీన విచారణకు రానున్న నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. వ్యవహారాన్ని ట్రైబ్యునల్‌లోనే తేల్చుకోవాలని చెబుతూ, టీజీఎండీసీ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

ఆర్ అండ్ బీ మాజీ సీఈ మోహన్ నాయక్‌పై ఈడీ నజర్

గత జూన్‌లో ఏసీబీ కేసు నమోదు
ఏసీబీ కేసు ఆధారంగా త్వరలో ఆయనకు నోటీసులు
మోహన్ నాయక్ ఆస్తుల మార్కెట్ విలువ దాదాపు రూ.200 కోట్లు

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఆదాయానికి మించి కూడబెట్టిన ఆర్ అండ్ బీ మాజీ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ ఆస్తులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టి సారించింది. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణలపై గత జూన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, మోహన్ నాయక్‌ను అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) అరెస్టు చేసింది. ఏసీబీ పెట్టిన కేసు ఆధారంగానే రంగంలోకి దిగిన ఈడీ.. త్వరలో ఆయనకు నోటీసులు జారీ చేసి విచారించనున్నది. ఆయనకు రూ.17.94 కోట్ల విలువైన ఆస్తులున్నాయని గుర్తించిన ఏసీబీ అధికారులు.. మార్కెట్ ధర ప్రకారం వాటి విలువ సుమారు రూ.200 కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేశారు. ఇప్పటి వరకూ ఏసీబీ నమోదు చేసిన 'ఆదాయానికి మించిన ఆస్తుల' కేసుల్లో అత్యధిక ఆస్తులున్న అధికారుల్లో ఆయనది రెండోస్థానం. గత జూన్‌లో మోహన్ నాయక్ నివాసంతోపాటు మొత్తం 15 చోట్ల ఏకకాలంలో జరిపిన సోదాల్లో నిజామాబాద్ జిల్లాలో 19.38 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని కొంపల్లి, గచ్చిబౌలిలలో ఏడు ప్లాట్లు, మియాపూర్‌లో రూ.2.5 కోట్ల విలువైన ట్రిప్లెక్స్ విల్లా, కూకట్‌పల్లిలో కొత్తగా నిర్మించిన ఇల్లున్నట్లు ఏసీబీ గుర్తించింది. ఇక నిజామాబాద్‌లో విల్లా కొనుగోలుకు రూ.కోటి అడ్వాన్సుగా చెల్లించినట్లు కనుగొన్న ఏసీబీ అధికారులు.. తమ సోదాల్లో రూ.55 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు ఖాతాల్లో రూ.1.44 కోట్ల విలువైన డిపాజిట్ల పత్రాలతోపాటు రూ.కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, విలువైన ఇతర వస్తువులను జప్తు చేశారు.

లైసెన్స్ సస్పెండైనా న్యాయవాదిగా రావడమా?

ఎఫ్ఐఆర్ నమోదుకు హైకోర్టు ఆదేశాలు

ప్రజా దీవెన, హైదరాబాద్ : లైసెన్స్ సస్పెండ్ అయినప్పటికీ ఆ విషయాన్ని దాచిపెట్టి న్యాయవాదిగా కోర్టు ఎదుట హాజరుకావడం మోసం చేయడం కిందికే వస్తుందని హైకోర్టు పేర్కొంది. అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేయకుండా రాష్ట్ర బార్ కౌన్సిల్ సస్పెన్షన్ విధించినప్పటికీ న్యాయవాది ఏ ఉషి రెడ్డి.. వకాలత్ దాఖలు చేయడమే కాకుండా, అడ్వకేట్ బ్యాండ్‌తో హాజరు కావడాన్ని తప్పుపట్టింది. ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఈ విషయాన్ని గుర్తించింది. ఆ న్యాయవాదిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి వీలుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రార్ (మేనేజ్‌మెంట్)కు ఆదేశాలు జారీచేసింది. మోసం చేయడం ద్వారా న్యాయపాలనలో అక్రమంగా జోక్యం చేసుకున్నందుకు కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని కూడా సూచించింది. కేసు విచారణ సందర్భంగా జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం ఈ విషయాన్ని గుర్తించింది. ఆ న్యాయవాదిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి వీలుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని రిజిస్ట్రార్ (మేనేజ్‌మెంట్)కు ఆదేశాలు జారీచేసింది. మోసం చేయడం ద్వారా న్యాయపాలనలో అక్రమంగా జోక్యం చేసుకున్నందుకు కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని కూడా సూచించింది.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

జాతీయ క్రికెట్ పోటీలకు ఎంపికైన పల్లవికి సన్మానం



ప్రజా దీవెన : జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారిణి మణిమద్దె పల్లవిని సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా సన్మానించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహిళా సాధికారత కేంద్రం (డీహెచ్‌ఈడబ్ల్యూ) ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ పల్లవిని శాలువాతో సత్కరించి అభినందించారు. 'బేటీ బచావో.. బేటీ పడావో' లోగోతో కూడిన క్రీడా దుస్తులు, క్రికెట్ బూట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. పట్టుదల, అంకితభావంతో సాధన చేసి పోటీల్లో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్పీ నరసింహ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పల్లవి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త చైతన్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ, ఫిజికల్ డైరెక్టర్ మీసాల కిరణ్, స్కూల్ అసిస్టెంట్ ప్రతాప్, పల్లవి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పరిరక్షించాలి.. ఎన్నికల కమిషనర్ ను తొలగించాలి!

శాలిగౌరారం : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రద్దు చేయాలని, 13.41 కోట్ల మంది ఓటు హక్కును పునరుద్ధరించాలని తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కోతి ఇందిరా-కృపాకర్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషన్ తీరుపై ఆమె తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే ఆయనను తొలగించి విచారణ జరపాలని కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం 2023ను సవరించి, నియామక కమిటీలో కేంద్ర మంత్రికి బదులుగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా ఢిల్లీలో నిరసన తెలుపుతున్న యువతపై దాడులను ఆపాలని, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

సామాజిక ఉద్యమాలతో సమాజంలో మార్పు తీసుకొస్తున్న కృష్ణ మాదిగ: రావెళ్ల



ప్రజా దీవెన, కోదాడ : ఎస్సీ వర్గీకరణ సాధనతో పాటు సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేస్తున్న సామాజిక ఉద్యమాలు అభినందనీయమని కోదాడ కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను కోదాడ కాంగ్రెస్ నాయకుడు రావెళ్ల కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో మంద కృష్ణ మాదిగ చేపడుతున్న సామాజిక ఉద్యమాలు, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషి గురించి ప్రస్తావించారు. సమాజంలో సమానత్వం సాధించాలన్న లక్ష్యంతో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్న మంద కృష్ణ మాదిగ సేవలను రావెళ్ల కృష్ణారావు అభినందించారు. దశాబ్దాలుగా సామాజిక వివక్ష, అసమానతలు ఎదుర్కొంటున్న వర్గాలకు న్యాయం జరగాలంటే నిరంతర సామాజిక చైతన్యం, ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం తదితర రంగాల్లో సముచిత అవకాశాలు లభించినప్పుడే సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు.

మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమాలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని రాష్ట్ర, జాతీయ స్థాయిలో విస్తృత చర్చకు తీసుకువచ్చాయని, సామాజిక న్యాయం కోసం సాగిన పోరాటాల్లో ఆయన కీలక పాత్ర పోషించారని రావెళ్ల కృష్ణారావు కొనియాడారు. అట్టడుగు వర్గాల సమస్యలను సమాజం దృష్టికి తీసుకెళ్లడంలో, వారి హక్కుల కోసం ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఆయన కృషి ప్రశంసనీయమని అన్నారు. సామాజిక సమానత్వం, మానవ హక్కులు, అణగారిన వర్గాల గౌరవప్రదమైన జీవనం కోసం సాగించే ఉద్యమాలకు ప్రజాస్వామ్య సమాజంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని పేర్కొంటూ, మంద కృష్ణ మాదిగ భవిష్యత్తులోనూ సామాజిక న్యాయం కోసం తన పోరాటాన్ని కొనసాగించాలని రావెళ్ల కృష్ణారావు ఆకాంక్షించారు.

ఈ మర్యాదపూర్వక భేటీ సామాజిక సమస్యలపై చర్చించడానికి, అణగారిన వర్గాల అభ్యున్నతి ప్రాధాన్యాన్ని గుర్తుచేసుకోవడానికి ఒక సందర్భంగా నిలిచింది.

పట్టభద్రుల ఓటును నమోదు చేసుకోవాలి

శాలిగౌరారం : శాలిగౌరారం మండలంలో నల్గొండ - ఖమ్మం - వరంగల్ పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలని శాలిగౌరారం మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు బొల్లికొండ గణేష్, మాజీ అధ్యక్షులు పాకాల సతీష్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకొని ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడాలని సూచించారు.



నాణ్యమైన ధాన్యం తీసుకురండి, మద్దతుధర పొందండి

నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కీలక పిలుపు, ఎల్‌నినో నేపథ్యంలో ప్రత్యా మ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి



ప్రజా దీవెన, నల్లగొండ: జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం పం డించిన రైతులు ప్రభుత్వం ప్రక టించిన కనీస మద్దతు ధరను పొందాలంటే నాణ్యతా ప్రమాణా లను తప్పనిసరిగా పాటించాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశే ఖర్ సూచించారు. ఎల్‌నినో ప్రభా వంతో నీటి లభ్యతపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశము న్నందున రైతులు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని పిలుపుని చ్చారు. మార్కెట్లో డిమాండ్ ఉ న్న పంటలను సాగు చేస్తే గిట్టు బాటు ధరతో పాటు అధిక లాభా లు పొందే అవకాశం ఉ ంటుందని పేర్కొన్నారు.సోమవారం నల్గొం డ జిల్లా కేంద్రం సమీపంలోని ఆ ర్జాలబావిలో ప్రాథమిక వ్యవ సా య సహకార సంఘం ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన 2026 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని న ల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీని వాసరెడ్డితో కలిసి కలెక్టర్ ప్రారం భించారు.

గ్రేడ్-ఏ ధాన్యానికి రూ.2,461 మద్దతు ధర

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,4 61, సాధారణ రకం ధాన్యానికి రూ.2,441 మద్దతు ధర ప్రకటిం చిందని తెలిపారు. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాల్‌కు అదనంగా రూ.500 బోనస్ అం దిస్తోందని వివరించారు.రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే ముందు తాలు, తరు గు, చెత్త, మట్టిపెళ్లలు, దుమ్ము లేకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ధాన్యంలో తేమ శాతం 17లోపు ఉండేలా చూసు కోవాలని స్పష్టం చేశారు. అప్పు డే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందేందుకు వీలుంటుం దని తెలిపారు.

జిల్లాలో 399 కొనుగోలు కేంద్రాలు

ఈ ఖరీఫ్ సీజన్‌లో నల్గొండ జిల్లా కు సన్న, దొడ్డు రకాల ధాన్యం క లిపి సుమారు 6.75 లక్షల మెట్రి క్ టన్నులు వచ్చే అవకాశం ఉం దని కలెక్టర్ అంచనా వెల్లడించా రు. ధాన్యం సేకరణ కోసం జిల్లా వ్యాప్తంగా 399 కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. రైతులకు ఎలాంటి ఇబ్బందు లు కలగకుండా అవసరమైన ఏ ర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సన్న ధాన్యం పండించిన రైతుల కు మద్దతు ధరతో పాటు బోనస్ అందేలా ప్రతి కొనుగోలు కేంద్రం లో వ్యవసాయ విస్తరణ అధికా రులను నియమించి, రైతులు తీవిసుకొచ్చే సన్న ధాన్యం రకాల ను గుర్తించి విశ్లేషించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశిం చారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు

మార్కెట్లో సన్న ధాన్యానికి డి మాండ్ ఎక్కువగా ఉ ండటంతో మిల్లర్లు రైతుల పొలాల వద్దకే వె ళ్లి కొనుగోలు చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. మరోవైపు దొడ్డు ధా న్యానికి ఇతర ప్రాంతాలు, రాష్ట్రా ల నుంచి డిమాండ్ తక్కువగా ఉండటంతో ధరల విషయంలో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయని వివరించారు.ఎల్‌నినో పరిస్థితు లను దృష్టిలో ఉంచుకొని రైతు లు నీటిని పొదుపుగా వినియో గించుకోవాలని సూచించారు. వ రి సాగుపై మాత్రమే ఆధారపడ కుండా కూరగాయలు, ఉద్యాన పంటలు, ఆరుతడి పంటల వం టి ప్రత్యామ్నాయ పంటలను సా గు చేయాలని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో రైతులు సమిష్టి వ్యవ సాయం చేపట్టి, మార్కెట్‌లో డి మాండ్ ఉన్న పంటలను ఎంచు కుంటే మెరుగైన ఆదాయం పొం దవచ్చని తెలిపారు. రైతులకు ప్రత్యామ్నాయ పంట లు, సమిష్టి వ్యవసాయం, నీటి పొదుపుపై అవగాహన కల్పిం చేందుకు ప్రతి మంగళవారం, శు క్రవారం రైతు వేదికల్లో 'రైతు నే స్తం' కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు వెల్లడించారు. రైతులు ఈ కార్యక్రమాలకు హాజరై వ్యవసా య నిపుణుల సూచనలు పొం దాలని కోరారు. సమిష్టి వ్యవసా యం చేసే రైతులకు, ప్రత్యామ్నా య పంటలు సాగు చేసే వారికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజ ను కొనుగోలు చేసేందుకు చర్య లు తీసుకుంటుందని తెలిపారు. సన్న ధాన్యంలో ఏడు రకాలను ప్రభుత్వం సూచించిందని, వాటి ని పండించిన రైతులకు క్వింటా ల్‌కు రూ.500 బోనస్ అంది స్తోం దని చెప్పారు.ఎల్‌నినో ప్రభావం తో నీటి లభ్యత తగ్గే అవకాశాల ను దృష్టిలో ఉంచుకొని రైతులు వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీరు అవసరమయ్యే పంటలను ఎంచుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో రెవెన్యూ అద నపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పీఏసీ ఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, ఆ దర్శ రైతు రామిరెడ్డి, నల్గొండ ఆ ర్డీవో వై. అశోక్ రెడ్డి, జిల్లా వ్యవ సాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా సహకార అధికారి మమత, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజ ర్ రాంపతి నాయక్, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి, మార్కెట్ కమి టీ చైర్మన్ హైమావతి, మాజీ ము న్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రె డ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మంత్రి కోమటిరెడ్డి చొరవతో పానగల్ ఛాయా సోమేశ్వరాలయా నికి మహర్దశ

రూ.20 కోట్ల నిధుల మంజూ రుపై హర్షాతిరేకం

మంత్రి కోమటిరెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: నల్ల గొం డ జిల్లాలోని చారిత్రాత్మక పా నగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఆలయ ప్రాం గణం లో హర్షాతిరేకాలు వెల్లివిరిశా యి. ఆలయ అభివృద్ధికి కృషి చేసిన రాష్ట్ర రోడ్లు, భవనాలు, సి నిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమ టిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆలయ కమి టీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమ వారం ఆలయ ప్రాంగణంలో మం త్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహిం చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశా రు. మంత్రి పేరుతో ప్రత్యేక పూజ లు కూడా నిర్వహించారు.

ఆలయ అభివృద్ధికి కీలక ముం దడుగు

ఆలయ కమిటీ ప్రతిపాదిత చైర్మ న్ కోడదల ఎల్లయ్య ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో న ల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కార్పొరేటర్ ఆట్ల కుంట్ల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ శతా బ్దాల చరిత్ర, విశిష్టమైన ఆధ్యా త్మిక ప్రాధాన్యత కలిగిన ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ. 20 కోట్ల భారీ నిధులు మంజూ రు కావడం సంతోషకరమని పే ర్కొన్నారు.ఈ నిధులతో ఆలయ అభివృద్ధి పనులు వేగవంతమై, పానగల్ ప్రాంతానికి మరింత గు ర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి పను లు పూర్తయితే రాష్ట్రంలోని వివి ధ ప్రాంతాల నుంచి భక్తులు, ప ర్యాటకుల రాక పెరిగే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా పా నగల్ ఆధ్యాత్మిక వైభవంతో పా టు పర్యాటక ప్రాధాన్యత కూడా మరింత పెరుగుతుందని అభిప్రా యపడ్డారు.

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు

ఆలయ అభివృద్ధికి సహకరించి న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తో పాటు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైత న్య శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీ టీ సీ గుమ్ముల మోహన్‌రెడ్డికి ఆల య కమిటీ సభ్యులు కృతజ్ఞత లు తెలిపారు.భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సహకరించా లని కోరారు. పానగల్ చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపా డుతూ మరింత అభివృద్ధి చేసేం దుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, గుండగోని యాదయ్య గౌడ్, గు రజాల నరేందర్, గుండగోని శ్రీని వాస్ గౌడ్, బుర్రి యాదయ్య, కొ మ్ము జానీ యాదవ్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, కొప్పు ప్రవీణ్, కొప్పు సత్తయ్య, గండికోట సాగర్, హరి శంకర్, జంపాల శంకర్, హర్ష, త క్కెళ్ల బన్నీ, ఆలయ అర్చకులు ఉదయ్ కుమార్, అజయ్ కుమా ర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నమోదు కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజా దీవెన,కోదాడ : 2027 వ సంవత్సరం లో జరగబోయే నల్గొండ ఖమ్మం వరంగల్ పట్టబద్రుల యం ఎల్ సి ఎన్నికలలో ఓటు నమోదుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఎమ్మెస్ కళాశాలలో ఎమ్మెస్ విద్యాసంస్థల చైర్మన్ పందిరి నాగిరెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 వరకు తన కళాశాల లు శ్రీ సాయి వికాస్ డిగ్రీ, తేజ ఫార్మసీ లలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు యం ఎల్ సి ఓటు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు ,యం ఎల్ సి ఓటు నమోదుకు తమ కళాశాల ఆఫీస్ సంప్రదించి ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ విద్యాసంస్థల సీఈవో ఎస్ఎస్ రావు, తేజ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ బి.యాదగిరి రెడ్డి, యం యస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ యం.ప్రసాద్,జూనియర్, ఫార్మసీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు అనంతరం పట్టభద్రులు రహీం సునీత లు తమ ఓటును నమోదు చేసుకున్నారు.



ఓటు హక్కు పరిరక్షణ కోసం ‘ఛలో ఢిల్లీ’ని విజయవంతం చేయండి

కాంగ్రెస్ నేతల కీలక అప్పీల్
నవంబర్ 1న రాంలీలా మైదా నంలో ఇండియా కూటమి మహా ర్యాలీ
నల్లగొండ జిల్లా నుంచి 2,000 మంది తరలిరావాలి
ఏఐసీసీ పరిశీలకులు రాంభూ పాల్ రెడ్డి



ప్రజా దీవెన, నల్లగొండ: ఓటు హ క్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య రక్ష ణ లక్ష్యంగా నవంబర్ 1న నిర్వ హించనున్న ‘ఛలో ఢిల్లీ’ కార్య క్ర మాన్ని విజయవంతం చేయాలని ఏఐసీసీ పరిశీలకులు రాంభూపా ల్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు వి నోద్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలు పునిచ్చారు. ఎస్ఐఆర్ (ꟻ×=) ప్ర క్రియలో ఓట్ల తొలగింపుపై నిర స నగా ఢిల్లీలోని రాంలీలా మైదా నంలో ఇండియా కూటమి ఆధ్వ ర్యంలో జరిగే మహా ర్యాలీకి నల్ల గొండ జిల్లా నుంచి సుమారు 2, 000 మంది తరలిరావాలని కో రారు.సోమవారం నల్లగొండ జి ల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతి థులుగా హాజరైన రాంభూపాల్ రెడ్డి, వినోద్ రెడ్డి అనంతరం మీ డియా సమావేశంలో మాట్లాడా రు. దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించారం టూ కాంగ్రెస్ నేతలు ఆరోపించా రు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కు మార్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఓ టర్ల జాబితాలో అక్రమాలు జరి గాయన్న ఆరోపణలపై సమగ్ర వి చారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కుకు భంగం కలిగితే ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు వాటిల్లుతుందని పేర్కొ న్నారు.

మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, ఆదివాసీ వర్గాలకు ఆశించిన ప్రయోజనాలు అందలేదని వారు విమర్శించారు. ప్రజల్లో ప్రభు త్వంపై అసంతృప్తి పెరుగుతోంద ని, అందుకే ఓటర్ల జాబితా అం శం రాజకీయంగా ప్రాధాన్యం సం తరించుకుందని వ్యాఖ్యానించా రు.

ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతను కాపాడాలి

సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సం స్థలతో పాటు ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతను కాపాడాల్సిన అ వసరం ఉందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల క మిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప ద వి నుంచి తొలగించాలని డిమాం డ్ చేశారు. ఓటును కాపాడు కుందాం, దేశాన్ని రక్షించుకుందాం అనే నినాదంతో ఛలో ఢిల్లీ కా ర్య క్రమాన్ని చేపడుతున్నట్లు తెలి పారు.నవంబర్ 1న ఢిల్లీలో జరి గే ఇండియా కూటమి మహా ర్యా లీలో కాంగ్రెస్ కార్యకర్తలు, నా యకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చే యాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు జిల్లపల్లి పరమే ష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీని వా స్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షు డు అంబటి సోమయ్య, మిర్యాల గూడ మున్సిపల్ చైర్మన్ చిలు కూరి బాలకృష్ణ, వివిధ మండ లాల కాంగ్రెస్ అధ్యక్షులు గథగోని కొండయ్య, లింగాల వెంకన్న, ఎ డ్ల ప్రవీణ్, అల్లంపల్లి జానయ్య, గాయం శ్యామ్ సుందర్ రెడ్డి, ఎ దులపురి కృష్ణ, ఎల్లంపల్లి నర సింహ, మర్రి చంద్రారెడ్డి, మేకల సాగర్ రెడ్డి, భీమనపల్లి సైదులు. మ హిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురా లు గాజుల సుకన్య, జిల్లా ఉపా ధ్యక్షుడు ఎండీ ముంతాజ్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యదర్శులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల బిల్లులు వెంటనే విడుదల చేయాలి



శాలిగౌరారం : శాలిగౌరారం మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు చేసిన కాంట్రాక్టర్లకు రెండున్నర ఏళ్లుగా బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పాఠశాలల్లో మైనర్ రిపేర్స్, కరెంట్, టాయిలెట్స్, డ్రింకింగ్ వాటర్, డ్రైనేజీ తదితర పనులు పూర్తి చేసినా డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మండలంలోని 10 గ్రామాల అమ్మ ఆదర్శ పాఠశాలల అధ్వకులు (కాంట్రాక్టర్లు) శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. శాలిగౌరారం మండలంలోని జడ్పిహెచ్ ఎస్, ఎంపీపిఎస్ పాఠశాలల్లో అధికారులు చెప్పిన పనులన్నీ పూర్తి చేసి,ఎంబి రికార్డ్ కూడా చేసి రెండున్నరేళ్ల క్రితమే ఎంపీడీఓ కార్యాలయం లో , నల్గొండ డిఈఓ ఆఫీసులో సమర్పించామన్నారు.అయినా నేటి వరకు ఒక్క రూపాయి కూడా తమ ఖాతాల్లో జమ కాలేదని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల బిల్లులు ఏడాది క్రితమే చెల్లించారని, ఒక్క నల్గొండ జిల్లాలో మాత్రమే పెండింగ్ లో ఉన్నాయని,డిఈఓ కార్యాలయం నుండి సీపీవో ఆఫీసుకు బిల్లులు ఇంతవరకు ఫార్వర్డ్ చేయలేదని ఆరోపించారు. ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా “ప్రాసెస్ లో ఉంది” అనే సమాధానం తప్ప బిల్లులు రావడం లేదని, తాము నిరుపేద కుటుంబాలకు చెందిన వారమని, అప్పులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ కు తెలిపారు. కావున తమపై దయ ఉంచి పెండింగ్ బిల్లులను తొందరగా విడుదల చేయించాలని కోరారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో రజిత,యాదమ్మ,అండాలు, పద్మ, శ్రీలత,పార్వతమ్మ,ఉప్పమ్మ తదితరులు ఉన్నారు

శాలిగౌరారం వార్డు మెంబర్ సుశీల అకాల మృతి

శాలిగౌరారం, అక్టోబర్ 26:శాలిగౌరారం గ్రామ పంచాయతీ 3వ వార్డు మెంబర్ నిమ్మల సుశీల – రాములు (60) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు.గత నెల రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మృతురాలికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.సుశీల అకాల మరణం పట్ల శాలిగౌరారం సర్పంచ్ శేఖర్ బాబు, ఉప సర్పంచ్ పాపరాములు, వార్డు మెంబర్లతో పాటు పలు పార్టీల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

జూనియర్ రాష్ట్రస్థాయి బాలికల హ్యాండ్ బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపిక



శాలిగౌరారం : ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో నిర్వహించిన జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో 10వ తరగతి విద్యార్థినులు షేక్ నస్రీన్, కంచుగట్ల హిమ వర్షిణి మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 31 నుండి నవంబర్ 2 వరకు ఖమ్మంలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ తెలిపారు.

ఎంపికైన విద్యార్థులను పాఠశాల పీడీ బొడ్డు మల్లేష్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న రక్షణ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయం



ప్రజా దీవెన, కోదాడ: గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్న రక్షణ వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు మున్సిపల్ పరిధిలోని కొమరబండ వై జంక్షన్ లో సోమవారం రక్షణ వెల్ఫేర్ ర్ సొసైటీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సమాచార హక్కు చట్టం కమిషనర్, ఎస్సీ ఎస్టీ మైనార్టీల చైర్మన్, వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ పి సుజాత విశిష్ట అతిథులుగా కోదాడ గ్రామపంచాయతీల సంఘం అధ్యక్షులు కొత్త గురవయ్య గుడిబండ గ్రామపంచాయతీ సర్పంచ్ మందుల నాగయ్య రెడ్లకుంట సర్పంచ్ పోలంపల్లి కుటుంబరావువులు పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల అభ్యున్నతికి రక్షణ వెల్ఫేర్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన చిన్నపిల్లలకు మెరుగైన విద్య అందించడం, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులను ప్రోత్సహించడం, మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడడం వంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. అలాగే రైతులకు సంబంధించిన కార్యక్రమాల ద్వారా వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ, రైతుల అభివృద్ధికి సొసైటీ బృందం చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. గ్రామీణ ప్రజల సంక్షేమం, విద్యాభివృద్ధి, మహిళా సాధికారత, రైతుల ప్రగతి కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన రక్షణ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులకు, ముఖ్య అతిథులకు, ఘనంగా సత్కరించారు

శాలిగౌరారం మండలంలో ధాన్యం తూకాల్లో మోసాలు

- మూడు కేసులు నమోదు



శాలిగౌరారం : ప్రైవేటు వ్యక్తులు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఫిర్యాదుల ఆధారంగా నల్గొండ జిల్లా లీగల్ మెట్రాలజీ శాఖ అధికారి శాలిగౌరారం మండలంలోని మనిమద్దె,గురజాల గ్రామాలలో ఉన్న వెయ్‌బ్రిడ్జిలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో సదరు వెయ్‌బ్రిడ్జిలపై 1,000 కిలోల ధాన్యం తూకానికి 10 కిలోల తక్కువ తూకం చూపిస్తున్నట్లు గుర్తించారు. దీనివల్ల రైతులు తమకు తెలియకుండానే కొనుగోలుదారులకు అదనంగా ధాన్యం అందజేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నట్లు గుర్తించారు. ఈ ఉల్లంఘనలకు సంబంధించి సంబంధిత వెయ్‌బ్రిడ్జిలపై లీగల్ మెట్రాలజీ చట్టం మరియు నిబంధనల ప్రకారం మూడు కేసులు నమోదు చేయడం జరిగింది. మూడు వెయ్‌బ్రిడ్జిలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీలను నల్గొండ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీనివాసులు, లైసెన్సుదారుడు శ్యాంసుందర్ తో కలిసి నిర్వహించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తూకం వేయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తూకాల్లో తక్కువ చూపించడం లేదా ఇతర అక్రమాలు జరిగినట్లు అనుమానం కలిగితే వెంటనే లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని శాఖ సూచిస్తోంది.

ఏలినినో ప్రభావం: యాసంగిలో ఆరుతడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలి

వ్యవసాయ శాస్త్రవేత్త ఏ. కిరణ్ సూచన



ప్రజా దీవెన, తుంగతుర్తి : ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున రైతులు యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాస్త్రవేత్త ఏ. కిరణ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గొట్టిపర్తి రైతు వేదికలో ‘ఖేతీ బచావో అభియాన్’ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూసార పరిరక్షణతోనే భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలను అందించవచ్చని అన్నారు. నేల ఆరోగ్యం, సమతుల్య ఎరువుల వినియోగం, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపికపై రైతులకు అవగాహన కల్పించారు. నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచడం ద్వారా నేల భౌతిక, రసాయనిక, జీవ లక్షణాలు మెరుగుపడతాయని, నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. పంట అవశేషాలను తగలబెట్టకుండా నేలలో కలియదున్నడం, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులను శాస్త్రీయ పద్ధతిలో వాడాలని సూచించారు. రసాయన ఎరువులను విచక్షణారహితంగా వాడకుండా, భూసార పరీక్షల ఆధారంగా నత్రజని, భాస్వరం, పొటాష్ లను సమతుల్యంగా అందించాలని, దీనివల్ల పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం కాపాడుకోవచ్చని అన్నారు. ప్రతి సీజన్ కు ముందు భూసార పరీక్షలు చేయించుకోవాలని, పంట మార్పిడి పాటించాలని సూచించారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా భూగర్భజల లభ్యతలో ఇబ్బందులు రావచ్చని, అందువల్ల యాసంగి ప్రణాళికను ముందుగానే రూపొందించుకోవాలని, నీటి వనరుల లభ్యతను అంచనా వేయకుండా అధిక నీటి అవసరం ఉన్న పంటలు సాగు చేయవద్దని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారి దేవ ప్రసాద్ మాట్లాడుతూ, యాసంగిలో వరి సాగు విస్తీర్ణాన్ని నీటి లభ్యతకు అనుగుణంగా తగ్గించి, మొక్కజొన్న, మినుములు, కందులు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. పంట ఎంపికలో నేల స్వభావం, నీటి లభ్యత, విత్తనాల లభ్యత, మార్కెట్ డిమాండ్, దిగుబడి, పెట్టుబడి వ్యయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సహాయ వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోత్స్న, హార్టికల్చర్ అధికారి ముత్యం రాజు, పంచాయతీ సెక్రటరీ శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

పిల్లలపై లైంగిక నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జ్: కే. సురేష్.



ప్రజా దీవెన, కోదాడ : పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాల విషయంలో విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కోదాడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జ్ కే. సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సురక్షిత్ బచపన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోదాడలోని అశోక్ నగర్‌లో గల కే, టి, ఎస్ స్కూల్‌లో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి సురేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్) లపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు.పిల్లల భద్రత, వారికున్న చట్టపరమైన రక్షణలు మరియు హక్కుల గురించి విద్యార్థులకు కూలంకషంగా వివరించారు.బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థులు ఎలాంటి న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా జాగ్రత్తగా ఉండాలని పలు సూచనలు చేశారు.పాఠశాల ప్రిన్సిపల్ బాణాల కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు, చిలకా రమేష్, అకడమిక్ ఇంచార్జి రాజా ,ఉపాధ్యాయులు ,సంబంధిత న్యాయవాదులు ,న్యాయ సేవల కమిటీ సభ్యులు, ప్రభుత్వ న్యాయవాదులు ,ప్యానెల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.....

పరిశోధనలపై ఫార్మసీ విద్యార్థులు దృష్టి సారించాలి

ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: బి.ఫార్మసీలో విద్యార్థులు విషయ పరిజ్ఞానంతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సూచించారు. విశ్వవిద్యాలయంలో తొలి బ్యాచ్ బి.ఫార్మసీ విద్యార్థుల కోసం నిర్వహించిన ప్రవేశ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ప్రారంభం నుంచే పరిశోధనల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని, ఔషధ రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధం కావాలని ఉపకులపతి పిలుపునిచ్చారు. దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో సేవలందించిన అనుభవజ్ఞులైన ఆచార్యుల బోధన, మార్గదర్శకత్వం లభించడం ఈ కళాశాల విద్యార్థులకు సదావకాశంగా పేర్కొన్నారు. ఔషధాలు, వ్యాక్సిన్ల తయారీకి ప్రధాన కేంద్రంగా ఉన్న హైదరాబాద్ సమీపంలో ఉండటం విద్యార్థుల శిక్షణ, పరిశోధన, ఉపాధి అవకాశాలకు అనుకూలమని తెలిపారు. విద్యార్థులు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని, దేశ నిర్మాణానికి దోహదపడే ఆరోగ్యకరమైన విద్యార్థి చైతన్యం ఎల్లప్పుడూ స్వాగతించదగినదని అన్నారు.

అనంతరం ఎంఎస్ఎన్ లేబొరేటరీస్‌కు చెందిన డాక్టర్ సూర్యకిరణ్ కడలి ఫార్మసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించారు. ముఖ్యంగా ఔషధ భద్రత పర్యవేక్షణకు సంబంధించిన ఫార్మకోవిజిలెన్స్ రంగంలోని అవకాశాలపై అవగాహన కల్పించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య అక్కినపల్లి రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, ఫార్మసీ విభాగ అధిపతి మరియు డీన్ ఆచార్య వీ కిషన్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ద వై ప్రశాంతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వసంత, డా అర్చన, డా జి ఉపేందర్ రెడ్డి, డా హరీష్ కుమార్, డా రాంచందర్ గౌడ్, డా మాధురి, తదితర అధ్యాపకులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ పోలీస్ గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులను పరిశీలన



ప్రజా దీవెన నల్లగొండ క్రైమ్: నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాల యంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ జిల్లా వ్యాప్తంగా సుమారు 45 ఫిర్యాదులను పరిశీలించారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయానికి వచ్చిన బాధితులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, మోసాలు, ఇతర సమస్యలకు సంబంధించి ప్రజలు అందించిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరిధిలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ కార్యాలయానికి వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను బాధ్యతాయుతంగా స్వీకరించాలని, ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం, బాధితులకు సత్వర న్యాయం కల్పించడం, పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించడం లక్ష్యంగా పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

పేదల పక్షాన పోరాడిన మహా నాయకుడు కామ్రేడ్ ఎర్రయ్య



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: రైతులు వ్యవసాయ కార్మికులు పేదల పక్షాన పోరాడిన నాయకుడు కామ్రేడ్ రుద్రాక్ష ఎర్రయ్య అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డిలి అన్నారు. సిపిఎం నల్గొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడవ డివిజన్లో ఉమ్మడి తానేదారిపల్లి సర్పంచ్ సిపిఎం నల్గొండ డివిజన్ నాయకులు కామ్రేడ్ రుద్రాక్ష ఎర్రయ్య 35వ వర్ధంతి సందర్భంగా కాజీరామారం స్టేజి దగ్గర గల ఆయన స్థూపం దగ్గర ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ సర్పంచిగా ఇళ్ల స్థలాలు పెంచడంలో ప్రజా సమస్యల పై పోరాటంలో వారు ఎంతో కృషి చేశారని కొనియాడారు. వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం రైతాంగం గిట్టుబాటు ధర కోసం పోరాటాల నిర్వహించే వాళ్ళని కొనియాడారు నిరుపేద గిరిజన కుటుంబంలో పుట్టిన ఆయన డివిజన్ స్థాయి నాయకుడిగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించి ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు గ్రామంలో పార్టీ పెంపుదల కోసం వారు చేస్తున్న కృషిని ఓరవలేని నరహంతక ముఠా హత్య చేశారని అన్నారు. భౌతికంగా లేకుండా చేయగలిగారే తప్ప వారి ఆశయాలను లేకుండా చేయలేరని అన్నారు వారు కోరుకున్న దోపిడీ లేని సమ సమాజాన్ని నిర్మించడమే ఆయన కల్పించే నిజమైన ఘన నివాళి అని అన్నారు. ఈ కార్య క్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హశం, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ ,అద్దంకి నరసింహ, గుండాల నరేష్ కన్నెకంటి సత్యనారాయణ సర్దార్ అలీ మూడవ డివిజన్ శాఖ కార్యదర్శి రుద్రాక్ష రామచంద్రు ఎర్రయ్య కుమారులు రుద్రాక్ష శ్రీనివాస్ రుద్రాక్ష జ్యోతి బస్ సీనియర్ నాయకులు రుద్రాక్ష దుర్గయ్య యాదయ్య మాజీ జెడ్పిటిసి పాలకూరి యాదయ్య బూర సత్తయ్య దొనకొండ రవికుమార్ నకిరేకంటి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

నల్లగొండ కలెక్టర్ బి చంద్రశేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ: పెండింగ్ ప్రజావాణి దరఖాస్తుల న్నింటిని వారంలోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశే ఖర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం లో భాగంగా సోమ వారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా స్థాయితో పాటు ,మండల స్థాయి వరకు ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న అన్ని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఈనెల 27 నుండి మూడు రోజులపాటు జిల్లాకు వర్షాలు వచ్చే సూచన ఉందన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో మండల ప్రత్యేక అధికారులు వారి వారి మండలాలలో అన్ని గ్రామాలలో కురిసిన వాన నీటిని సంరక్షించాలని, సోక్ పిట్లు, కాలువలు, చెరువుల్లో, భూమిపై పడిన ప్రతివర్షపు చుక్కను సద్వినియోగం అయ్యేలా,భూమిలోకి ఇంకేలా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో నీటి గణంకాలు నిర్వహించాలని, ఆయా కార్యాలయాలకు ఎక్కడినుండి మీరు వస్తున్నది? ఎక్కడ నిల్వ ఉంచుతున్నారు? ఎలా వినియోగిస్తున్నారన్న పూర్తి వివరాలు సమర్పించాలని ,ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా నీటి నిలువ కట్టడాలు ఉండాలని, అన్ని హాస్టళ్ళలో కూడా నీటి గణాంకాలు జరగాలని, హాస్టల్లలో వినియోగించే కిచెన్ వాటర్, స్నానాల ద్వారా వచ్చే నీటిని అక్కడే ఇంకెలా చర్యలు తీసుకోవాలని ,ఇందుకు నీటి నిల్వ కట్టడాలను, ఇంకుడు గుంతలను నిర్మించాలని, ఈ వారంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో సోక్ పిట్ల నిర్మాణం పూర్తిస్థాయిలో ఉండాలని, అలాగే కమ్యూనిటీ సోక్ పిట్లు పూర్తి చేయాలని, దీన్నొక ఛాలెంజ్ గా తీసుకొని నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి అధికారి, సిబ్బందిపై ఉందని అన్నారు. ఎల్ నినో దృష్ట్యా రైతులు రబీలో వరి వైపు వెళ్లకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని, ఎట్టి పరిస్థితులలో రైతులు వరి సాగు చేసి ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా సాధ్యమైనంతవరకు సమిష్టి వ్యవహారం చేసే విధంగా చూడాలని, ఎవరైనా సమిష్టి వ్యవసాయానికి ముందుకొస్తే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలన్నారు. వి బి జి రాంజీ కింద పనులలో కూలీల అందరిని భాగస్వామ్యం చేయాలని, కూలీలందరికీ వేతనం వచ్చేలా చూడాలని, అలాగే గ్రామాలలో తాగనీటి ఆడిట్ నిర్వహించాలని, మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో తిరగాలని, నవంబర్ నెల మొత్తం టీజీపీఎస్సీ ద్వారా నిర్వహించే పలు రకాల పరీక్షల సక్రమ నిర్వహణ తోపాటు, క్షేత్రస్థాయిలో తాగునీరు, ప్రత్యామ్నాయ పంటలు వంటి వాటన్నిటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు పంటల విధానాలు మార్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, కాగా ఈ సోమవారం రెవెన్యూ శాఖకు(64) ఫిర్యాదులు, ఇతర శాఖలకు (51) ఫిర్యాదులు,మొత్తం (115) దరఖాస్తులు వచ్చాయి. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.



ప్రశాంతంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు





ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమి షన్ ద్వారా ఈనెల 24 ,26 తేదీ లలో జిల్లా కేంద్రంలోని ఎస్ పి ఆ ర్ పాఠశాల పరీక్ష కేంద్రంలో నిర్వ హించిన అసిస్టెంట్ సైంటిస్ట్ (అ నాలిస్ట్ గ్రేడ్- 2) అసిస్టెంట్ ఎ న్వి రాన్మెంటల్ ఇంజనీర్ కం ప్యూ ట ర్ ఆధారిత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం అసిస్టెంట్ సైంటిస్ట్ (అనాలిస్ట్ గ్రేడ్ -2) పరీ క్షలు పూర్తి కాగా, సోమవారం అ సిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజ నీర్ పరీక్ష కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో నిర్వహించడం జరిగిం ది. ఈ పరీక్షకు ఉదయం 180 మంది అభ్యర్థులకు గాను 125 మంది హాజరుకాగా,మధ్యాహ్నం పరీక్షకు 124 మంది హాజర య్యారు.ఉదయం నిర్వహించిన పరీక్ష ను జిల్లా కలెక్టర్ బి. చంద్ర శేఖర్ ఎస్పిఆర్ పాఠశాలలో ఏ ర్పాటు చేసిన పరీక్ష కేంద్రానికి వె ళ్లి తనిఖీ చేశారు. అభ్యర్థులు పరీక్ష రాస్తున్న కేంద్రంలోకి వెళ్లి ఏ ర్పాట్లను, కేటాయించిన అభ్య ర్థులు, హాజరు వివరాలను,జిల్లా అధికారి జిల్లా పరిశ్రమల మేనేజ ర్ సతీష్ ద్వారా అడిగి తెలుసు కున్నారు. అసిస్టెంట్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహణ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేవని, పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు.

నవంబర్ నెలలో కూడా టీజీపీఎస్సీ ద్వారా మరిన్ని ఆన్లైన్ పరీక్షలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లాలో వివిధ కేంద్రాలను ముందుగానే పరిశీలించి పరీక్షల నిర్వహణకు సన్నద్ధం చేయాలని నల్గొండ ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి కి సూచించారు. అలాగే ఇన్విజిలేటర్లు,చీఫ్ సూపరింటిండెంట్లను ఎప్పటికప్పుడు మార్పు చేర్పులు చేస్తూ ఉండాలని, పరీక్షలకు తగ్గట్టుగా నియమించాలని సూచించారు. ఆర్డీ ఓ వై.అశోక్ రెడ్డి, డిఎస్పి శివరాం రెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులైన పట్టభద్రులందరూ గడు వులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చం ద్రశేఖర్



ప్రజా దీవెన, నల్లగొండ : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజక వర్గంలో అర్హులైన పట్టభద్రులందరూ నవంబర్ 6 వ తేదీలోగా ఫారం -18 లో ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కోరారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి టి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియ, పట్టభద్రుల నియోజక వర్గ ఓటరు నమోదు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల నియోజక వర్గ ఓటరు నమోదు ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని, ఓటరు నమోదుపై ఇప్పటికే రెండుసార్లు వార్తాపత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని తెలిపారు.మొత్తం 12 జిల్లాల్లోని 192 మండలాల్లో నమోదు ప్రక్రియ కొనసాగుతున్నదని, దరఖాస్తుల పరిశీలనకు 249 మంది అధికారులను నియమించామని జిల్లా కలెక్టర్ మరియు వరంగల్ -ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఆర్ ఓ బి.చంద్రశేఖర్ వివరించారు. అలాగే 644 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు.పట్టభద్రుల ఓటరు నమోదు కోసం ఇప్పటివరకు 3,26,669 దరఖాస్తులు అందాయని కలెక్టర్ వెల్లడించారు. ఫారం-18 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో పరిశీలించడంతోపాటు, సంబంధిత అధికారులు ఒరిజినల్ ధ్రువపత్రాలను తనిఖీ చేసి అర్హతను నిర్ధారిస్తున్నారని వివరించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి టి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా పెండింగ్లో ఉన్న ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, సంబంధిత ధ్రువపత్రాలను తనిఖీ చేసిన తర్వాతే నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఈఆర్వోలు, ఎ ఈఆర్వోల సమన్వయంతో దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలని, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియపై ప్రతిరోజూ నివేదికలు సమర్పించడంతోపాటు, విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 వ తేదీ చివరి గడువు కావడంతో అర్హులైన పట్టభద్రులు ఎవరూ అవకాశాన్ని కోల్పోకుండా సకా లంలో దరఖాస్తు చేసుకోవా లని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కో రారు.ఈ వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా రెవిన్యూ అద నపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఎన్నిక ల సూపర్డెం ట్ కృష్ణమూర్తి, వం శీ.ఇతర అధి కారులు పాల్గొన్నా రు.

హ్యాట్రిక్ విజయంపై భారత్ కన్ను!

సిరీస్ ఆశలు నిలవాలంటే కివీస్ గెలవాల్సిందే..

సిరీస్ లో 0-2తో వెనుకబడిన కివీస్

హెన్రీ, ఫెర్గూసన్ దూరం.. ఆతిథ్య జట్టుకు ఎదురుదెబ్బ

హ్యాట్రిక్ విజయంపై టీమ్ఇండియా గురి

వెల్లింగ్టన్ గాలులు, చిన్న బౌండరీలతో కొత్త సవాలు

రెండో టీ20లో నాలుగు వికెట్లు తీసిన శాంట్నర్‌తో ప్రమాదం



న్యూజిలాండ్‌తో మూడో టీ20కి రంగం సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమిండియా మరో గెలుపుతో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు సొంతగడ్డపై ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓడిన న్యూజిలాండ్‌కు ఇది చావోరేవో పోరు. ఈ మ్యాచ్‌లోనూ ఓడితే సిరీస్ చేజారిపోతుంది. కీలకమైన ఈ పోరుకు ముందు కివీస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్లు మాట్ హెన్రీ, లాకీ ఫెర్గూసన్ మూడో టీ20కి దూరమయ్యారు. దీంతో ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టుకు సవాలు మరింత పెరిగింది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టీ20లో మాట్ హెన్రీ కేవలం రెండు ఓవర్లే బౌలింగ్ చేశాడు. అందులో ఒకటి మెయిడిన్. కాలి కండరాల సమస్యతో ఇబ్బందిపడిన అతడిని మిగిలిన సిరీస్ నుంచి తప్పించారు. ఇతర ఫార్మాట్లకు సిద్ధమయ్యేందుకు అతడి పనిభారాన్ని తగ్గించాలని జట్టు నిర్ణయించింది. లాకీ ఫెర్గూసన్ కూడా రెండో మ్యాచ్‌లో పూర్తి కోటా ఓవర్లు వేయకుండానే మైదానం వీడాడు. ముందు జాగ్రత్త చర్యగా అతడికి మూడో మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వనున్నారు. ఈ ఇద్దరు లేకపోవడంతో ఆడమ్ మిల్నే, బ్లెయిర్ టిక్నర్‌లపై కివీస్ ఆధారపడాల్సి ఉంటుంది. కైల్ జేమీసన్ కూడా వెల్లింగ్టన్ మ్యాచ్ ఆడిన తర్వాత టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఫోర్డ్ ట్రోఫీలో పాల్గొననున్నాడు.

గెలుపు జోరులో భారత్.. భువీపై ప్రత్యేక దృష్టి

మరోవైపు టీమిండియా ఇప్పటివరకు అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేసింది. తొలి మ్యాచ్‌కు ముందు ఒక్కసారి మాత్రమే ప్రాక్టీస్ చేసినప్పటికీ, బ్యాటింగ్‌లో సత్తా చాటింది. తొలి టీ20లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 181 పరుగుల లక్ష్యాన్నీ అందుకుంది. అయితే న్యూజిలాండ్ ఫీల్డింగ్, బౌలింగ్‌లో చేసిన తప్పిదాలు కూడా భారత్ విజయాలకు కారణమయ్యాయి. భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఎనిమిది ఓవర్లు వేసి 99 పరుగులు ఇచ్చిన అతడు ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. వెల్లింగ్టన్‌లోనైనా పుంజుకుంటాడని భారత జట్టు ఆశిస్తోంది.

గాలులు.. చిన్న బౌండరీలు కీలకం!

వెల్లింగ్టన్‌లోని హెచ్ఎన్ఆర్‌వై స్టేడియం పరిస్థితులు భారత్‌కు కొత్త సవాలు విసరనున్నాయి. 'కేక్ టిన్'గా పేరున్న ఈ మైదానంలో సాధారణంగా బలమైన గాలులు వీస్తుంటాయి. ఇక్కడి పిచ్ కూడా డ్రాప్-ఇన్ పిచ్. మైదానానికి ఇరువైపులా స్క్వేర్ బౌండరీలు సుమారు 60 మీటర్లే ఉండటంతో బ్యాటర్లు భారీ షాట్లతో విరుచుకుపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితులకు తగ్గట్టుగా భారత బౌలర్లు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది.

ఇక గాయం నుంచి పూర్తిగా కోలుకోని ఇషాన్ కిషన్ మూడో మ్యాచ్‌కూ అందుబాటులో ఉండడం లేదు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఇంకా కోలుకుంటున్నాడు. దీంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరోసారి మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం దక్కనుంది. గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే భారత్ బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి.

గణాంకాల్లోనూ భారత్‌దే పైచేయి

న్యూజిలాండ్‌తో టీ20ల్లో భారత్ రికార్డు మెరుగ్గా ఉంది. ఇరు జట్ల మధ్య జరిగిన 33 టీ20ల్లో భారత్ 21 గెలవగా, న్యూజిలాండ్ 11 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. న్యూజిలాండ్ గడ్డపై ఆడిన 14 టీ20ల్లోనూ భారత్ తొమ్మిది విజయాలు సాధించింది. భారత బ్యాటర్ తిలక్ వర్మ ఛేజింగ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. టీ20ల్లో లక్ష్య ఛేదన సమయంలో అతడి సగటు 51.6 కాగా, తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు 39.7గా ఉంది. తిలక్ నాటౌట్‌గా నిలిచిన 12 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలిచింది. మొత్తం టీ20 క్రికెట్‌లో అతడు నాటౌట్‌గా ముగించిన 26 ఇన్నింగ్స్‌ల్లోనూ అతడి జట్టే విజయం సాధించడం విశేషం. 2025 నుంచి ఇప్పటివరకు 52 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 1,282 పరుగులు చేసిన తిలక్.. 41.4 సగటు, 141.7 స్ట్రైక్‌రేట్‌తో రాణించాడు. అయితే భారత బ్యాటర్లకు కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నుంచి ముప్పు పొంచి ఉంది. రెండో టీ20లో అతడు నాలుగు వికెట్లు పడగొట్టాడు. 2025లో స్పిన్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు సగటున 58.2 పరుగులు చేయగా, 2026లో ఆ సగటు 27.3కు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత్ వికెట్లు వేగంగా కోల్పోతోంది. ఈ బలహీనతను శాంట్నర్ మరోసారి ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. మొత్తానికి, భారత్ హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకుంటుందా? లేక కివీస్ పుంజుకుని పోరును ఆసక్తికరంగా మారుస్తుందా? అనేది చూడాలి.

మ్యాచ్ వివరాలు

తేదీ: అక్టోబర్ 27, మంగళవారం
సమయం: మధ్యాహ్నం 12.30 గంటలకు
వేదిక: హెచ్ఎన్ఆర్‌వై స్టేడియం, వెల్లింగ్టన్
ప్రత్యక్ష ప్రసారం: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్
లైవ్ స్ట్రీమింగ్: సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్

ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్

న్యూజిలాండ్-ఎ పై పడిక్కల్ దండయాత్ర

న్యూజిలాండ్-ఎ జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్-ఎ జట్టు అద్భుత పునరాగమనం (కంబ్యాక్) సాధించింది. భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (199) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మ్యాచ్‌పై ఇండియా-ఎ పూర్తి ఆధిపత్యం సాధించింది. బెర్ట్ సట్‌క్లిఫ్ ఓవల్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజు పోరులో పడిక్కల్ సుడిగాలి సెంచరీతో జట్టును సురక్షిత తీరానికి చేర్చాడు. పడిక్కల్ 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 80.24 స్ట్రైక్ రేట్‌తో 199 పరుగులు సాధించాడు. అయితే టీ విరామానికి 10 నిమిషాల ముందు జాక్ గిబ్సన్ బౌలింగ్‌లో అంపైర్ ఇచ్చిన క్యాచ్ ఔట్ నిర్ణయంతో పడిక్కల్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యాడు. బంతి బ్యాట్‌కు అసలు తగలలేదని సైగలు చేస్తూ, మైదానంలోనే అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నిరాశగా వెనుతిరిగాడు. కేవలం ఒక్క పరుగు తేడాతో ద్విశతకం (డబుల్ సెంచరీ) చేజార్చుకున్నప్పటికీ, అతడు ఆడిన ఇన్నింగ్స్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది.



ఘోర పతనం నుంచి అద్భుత కంబ్యాక్!

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ కేవలం 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 'ఎ' 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ ఆధిపత్యాన్ని సాధించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలోనూ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లు 9 పరుగులకే పెవిలియన్ చేరడంతో భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన పడిక్కల్, సాయి సుదర్శన్ (91)తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 215 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత యష్ రాథోడ్‌తో కలిసి మరో 142 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని జోడించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ 6 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసి, 174 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

రేసులో పడిక్కల్.. టెస్టు బెర్త్ కోసం గట్టి పోటీ!

టెస్ట్ క్రికెట్‌లో పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. శ్రీలంక పర్యటనలో స్పిన్నర్లపై ధాటిగా ఆడిన అతడు, ఇప్పుడు న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లపై కూడా సత్తా చాటాడు. రాబోయే సీనియర్ టెస్ట్ జట్టులో మూడో స్థానం కోసం పోటీపడుతున్న సాయి సుదర్శన్, పడిక్కల్‌లు ఇద్దరూ ఈ మ్యాచ్‌లో రాణించడం విశేషం. నాలుగు రోజుల ఈ మ్యాచ్ ఆఖరి రోజున భారత్ విజయం సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

విరాట్, రోహిత్‌ల తర్వాతి సూపర్‌స్టార్ వచ్చేశాడు..

యువ ఆటగాడిపై క్లూసెనర్ ప్రశంసలు!



భారత క్రికెట్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ శకం తర్వాత ఎవరు ఆ స్థాయికి ఎదుగుతారనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత క్రికెట్ తర్వాతి సూపర్‌స్టార్ ఇప్పటికే వచ్చేశాడని, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని ఉద్దేశించి పేర్కొన్నాడు. మరోవైపు శుభ్‌మన్ గిల్ భారత జట్టును చాలా ఏళ్ల పాటు ముందుండి నడిపించగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. అబుదాబి టీ10 లీగ్‌లో అరేబియన్ ఏసెస్ జట్టుకు ప్రధాన కోచ్‌గా వ్యవహరిస్తున్న క్లూసెనర్.. ఓ కార్యక్రమం సందర్భంగా ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. కోహ్లీ, రోహిత్ భారత క్రికెట్‌కు చేసిన సేవలను గుర్తు చేస్తూనే, దిగ్గజ ఆటగాళ్లు తప్పుకున్నంత మాత్రాన ఆట ఆగిపోదని అన్నాడు. "విరాట్, రోహిత్ గతంలో ఎంత గొప్పగా ఆడినా.. సరైన సమయం వచ్చినప్పుడు వారు ఆటకు వీడ్కోలు పలకాల్సిందే. కానీ క్రికెట్ గొప్పదనం ఏమిటంటే.. అది నిరంతరం కొనసాగుతుంది. ఒక్కోసారి మరింత బలపడుతుంది కూడా" అని క్లూసెనర్ పేర్కొన్నాడు. సచిన్ టెండూల్కర్ రికార్డులను ఎవరూ బద్దలు కొట్టలేరని గతంలో అనుకునేవారని, కానీ ఇప్పుడు ఆ రికార్డులకు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయని గుర్తు చేశాడు. ఆటగాళ్లు వస్తుంటారు, వెళుతుంటారని.. దిగ్గజాలు ఆటకు దూరమైనప్పుడు బాధ కలిగినా, వారి స్థానంలోకి రావడానికి యువకులు సిద్ధంగా ఉంటారని వివరించాడు.

గిల్‌పై విశ్వాసం

శుభ్‌మన్ గిల్‌ను క్లూసెనర్ ప్రశంసలతో ముంచెత్తాడు. బ్యాటర్‌గా గిల్ అద్భుతమైన ఆటగాడని, నాయకుడిగా కూడా తనదైన ముద్ర వేయగలడని అన్నాడు. అయితే బ్యాటర్‌గా తన పాత్రను, కెప్టెన్‌గా తన బాధ్యతలను వేర్వేరుగా చూడటం గిల్‌కు కీలకమని సూచించాడు. "గిల్ సరైన వ్యక్తి అనే విషయంలో నాకు ఎలాంటి సందేహం లేదు. బ్యాటింగ్‌లో అతడు అద్భుతమైన సూపర్‌స్టార్. బ్యాటర్‌గా, కెప్టెన్‌గా వేర్వేరు పాత్రలను నిర్వహించడం గిల్ నేర్చుకోవాలి. గొప్ప కెప్టెన్లంతా ఈ విషయంలో విజయం సాధించారు" అని తెలిపాడు. కెప్టెన్సీ అనేది నిరంతరం నేర్చుకునే ప్రక్రియ అని, అనుభవజ్ఞులైన నాయకులు కూడా రోజూ కొత్త విషయాలు నేర్చుకుంటారని క్లూసెనర్ పేర్కొన్నాడు. సీనియర్ల సలహాలు తీసుకుంటూ గిల్ తన నాయకత్వ శైలిని అభివృద్ధి చేసుకోవాలని అభిప్రాయపడ్డాడు. అతడు రాబోయే ఎన్నో ఏళ్ల పాటు భారత క్రికెట్‌కు ధైర్యంగా, లక్ష్యంతో సేవలందిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు.

ఏఐటీఏ ఎన్నికల్లోకి సానియా, భూపతి... లియాండర్ పేస్ అధ్యక్ష ఆశలకు గండి!

భారత టెన్నిస్‌లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దిగ్గజ క్రీడాకారులు సానియా మీర్జా, మహేశ్ భూపతి అఖిల భారత టెన్నిస్ సంఘం పరిపాలనలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు, అధ్యక్ష పదవిని ఆశించిన మరో లెజెండ్ లియాండర్ పేస్ అనూహ్యంగా రేసు నుంచి తప్పుకున్నట్టయింది. వివరాల్లోకి వెళితే, AITAలో స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ అవుట్‌స్టాండింగ్ మెరిట్ ప్రతినిధుల ఎన్నిక కోసం సానియా, భూపతి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, అధ్యక్ష పదవికి పోటీ చేస్తారని భావించిన లియాండర్ పేస్ మాత్రం నామినేషన్ వేయలేదు. AITA సవరించిన నిబంధనల ప్రకారం, అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే ఎస్ఓఎం ప్రతినిధిగా ఎన్నికై ఉండాలి లేదా గతంలో కార్యవర్గంలో పనిచేసి ఉండాలి. ఈ రెండు అర్హతలు లేని పేస్‌కు SOM ఎన్నికల ద్వారా రావడం ఒక్కటే మార్గం. కానీ పేస్ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో అధ్యక్ష పదవికి అనర్హుడయ్యాడు. గతంలో బెంగాల్ టెన్నిస్ సంఘం పేస్‌ను అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. సానియా, భూపతితో పాటు అంకితా భాంబ్రి, ప్రస్తుత డేవిస్ కప్ కోచ్ ఆశుతోష్ సింగ్, విశాల్ ఉప్పల్ సహా మొత్తం 8 మంది మాజీ ఆటగాళ్లు SOM ఎన్నికల బరిలో నిలిచారు. క్రీడా సమాఖ్యల నిర్వహణలో మాజీ ఆటగాళ్లకు ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీని ప్రకారం నలుగురు ఎస్ఓఎం ప్రతినిధులను జనరల్ బాడీకి, ఇద్దరిని ఎగ్జిక్యూటివ్ కమిటీకి ఎన్నుకుంటారు. ఈ పరిణామంపై మహేశ్ భూపతి స్పందిస్తూ, "ప్రతి క్రీడా సమాఖ్యకు ఉన్నత స్థాయిలో ఆడిన ఆటగాళ్ల సేవలు అవసరం. బ్యాడ్మింటన్‌లో గోపీచంద్ చేసిన మార్పులే దీనికి ఉదాహరణ" అని తెలిపారు. నవంబర్ 7న SOM ఎన్నికలు, నవంబర్ 27న AITA ప్రధాన ఎన్నికలు జరగనున్నాయి.

‘ఆదర్శ కుటుంబం’ త్రివిక్రమ్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది: శ్రీనిధి శెట్టి



విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో తెరకెక్కుతున్న చిత్రం ‘ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47’. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా మీడియాతో మాట్లాడిన శ్రీనిధి, ఈ సినిమా తనకు ప్రత్యేకమని చెప్పారు. త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించాలన్నది తన కోరికని, ఆయన నుంచి అవకాశం రావడం సంతోషంగా అనిపించిందని తెలిపారు. ఈ కథ త్రివిక్రమ్ గత సినిమాల కంటే భిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సినిమాలో శ్రీనిధి తల్లి పాత్రలో కనిపించనున్నారు. చిట్‌ఫండ్‌లో డబ్బులు పోగొట్టుకుని అప్పుల్లో కూరుకుపోయే మహిళగా నటించారు. తొలిసారి పూర్తిస్థాయి కామెడీ పాత్ర చేయడంతో మొదట కొంత సందేహం కలిగినా, సినిమా చూసిన తర్వాత తన నటనపై సంతృప్తి కలిగిందని చెప్పారు. త్రివిక్రమ్ రాసిన సంభాషణల్లో మంచి అర్థం ఉంటుందని, ప్రతి డైలాగ్‌ను అర్థం చేసుకుని చెప్పేందుకు ప్రయత్నించానని శ్రీనిధి తెలిపారు. వెంకటేష్ కామెడీ టైమింగ్ అద్భుతమని, ఆయనతో కలిసి నటించడం మంచి అనుభవమని అన్నారు. సినిమా విడుదల తేదీని అక్టోబర్ 9 నుంచి 30కి మార్చడంపై స్పందిస్తూ, మంచి అవుట్‌పుట్ కోసం అదనపు సమయం తీసుకోవడం సరైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. కథ నచ్చితేనే సినిమాలు ఎంచుకుంటానని చెప్పిన శ్రీనిధి, ప్రస్తుతం ఓ కన్నడ చిత్రంలో నటిస్తున్నట్లు వెల్లడించారు. మరికొన్ని తెలుగు సినిమాలపై చర్చలు జరుగుతున్నాయని తెలిపారు.

విజయ్‌ను వెయ్యిసార్లయినా అడుగుతా.. రష్మిక గట్టి కౌంటర్!

విజయ్ దేవరకొండ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పెళ్లి గురించి మాట్లాడారు. పెళ్లి చేసుకుందామని రష్మిక తనను చాలాసార్లు అడిగేదని సరదాగా చెప్పారు. అయితే ఆ మాటలను పట్టుకుని కొందరు నెటిజన్లు రష్మికపై రకరకాల కామెంట్స్ చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విజయ్‌ను పెళ్లి కోసం ఆమె ఒత్తిడి చేసిందనేలా వీడియోలు కూడా వచ్చాయి. దీంతో ఇప్పటివరకు ఇలాంటి విషయాలను పెద్దగా పట్టించుకోని రష్మిక, ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా తొమ్మిది స్టైడ్లతో సమాధానం ఇచ్చారు. కొన్ని వీడియోలు అసలు ఇంటర్వ్యూ సందర్భాన్ని కూడా మార్చేశాయని ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ మధ్య జరిగిన సంభాషణను చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారని రష్మిక చెప్పారు. ఎన్నిసార్లు అడిగాను, ఏడాది మొత్తం అడుగుతూనే ఉన్నానా అనేది అసలు విషయం కాదన్నారు. తనకు కావాల్సిన జీవితం మీద ముందే క్లారిటీ ఉందని, విజయ్ మాత్రం పెళ్లికి సంబంధించిన ప్రాక్టికల్ విషయాలను ఆలోచించేందుకు సమయం తీసుకున్నారని వివరించారు. అందువల్ల ఇద్దరి మధ్య ప్రేమలో ఎలాంటి మార్పు రాలేదని స్పష్టం చేశారు. తాను మనసుతో నిర్ణయాలు తీసుకుంటే విజయ్ ఆచితూచి ఆలోచించే వ్యక్తి అని చెప్పారు. పెళ్లి అంటే మోకాళ్లపై కూర్చుని ఉంగరం ఇవ్వడం మాత్రమే కాదని రష్మిక అభిప్రాయపడ్డారు. కలిసి భవిష్యత్తును నిర్మించుకోవడమే తమకు ముఖ్యమని చెప్పారు. విజయ్‌ను అంతగా ప్రేమిస్తున్నానని బహిరంగంగా చెప్పుకోవడాన్ని కూడా కొందరు తప్పుపడుతున్నారని ప్రస్తావించారు. పెళ్లయ్యాక కూడా ఆయనతో మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనిపిస్తుందని, వంద కాదు వెయ్యిసార్లయినా అదే మాట చెబుతానని రాశారు. అది తన ప్రేమను వ్యక్తం చేసే విధానమన్నారు. జీవితాంతం ఆయనతోనే ఉండాలనేది తన కోరిక. తనకు సలహాలు ఇస్తూ రీల్స్ చేస్తున్న మహిళలకూ రష్మిక సమాధానం ఇచ్చారు. గతంలో కష్టమైన రోజులు ఎదురైనప్పుడు ఆ సలహాలు ఇచ్చేవాళ్లు ఎవరూ పక్కన లేరని చెప్పారు. గాయం అయినప్పుడు, నెలనెలా శారీరక నొప్పులు వచ్చినప్పుడు, అర్ధరాత్రి ఆందోళనతో నిద్రలేచినప్పుడు విజయ్ తనకు అండగా ఉన్నాడని వివరించారు. అందుకే తన రిలేషన్‌షిప్ గురించి బయటివాళ్లు చెప్పే మాటలతో నిర్ణయం మార్చుకోనన్నారు. తన విజయాలను కూడా విజయ్ తనకంటే ఎక్కువగా సెలబ్రేట్ చేస్తాడని చెప్పుకొచ్చారు. తనను విమర్శించడం ఒకటైతే, తన కుటుంబాన్ని ఇందులోకి లాగడం మరో విషయమని రష్మిక మండిపడ్డారు.





అనుపమ మేడం.. మీరు గ్రేట్!

తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్స్‌గా ఎక్కువ మంది ఇతర భాషల హీరోయిన్స్ ఉన్నారు. స్టార్ హీరోయిన్స్ జాబితా తీస్తే అందులో మొత్తం ఇతర భాషలకు చెందిన వారే ఉంటారు. ఈమధ్య కాలంలో ఇద్దరు ముగ్గురు తెలుగు అమ్మాయిలు తెలుగు సినిమాలతో గుర్తింపు తెచ్చుకుని, హీరోయిన్స్‌గా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇతర భాషల నుంచి వచ్చిన హీరోయిన్స్ లో ఎక్కువ శాతం మంది సొంతంగా డబ్బింగ్ చెప్పుకోలేక పోతున్నారు. కేవలం యాక్టింగ్ చేసి వారు వెళ్తే, వారికి మళ్లీ వేరే డబ్బింగ్ ఆర్టిస్ట్‌లు వాయిస్ ఇవ్వాల్సి వస్తుంది. అలా చేస్తే సోల్ మిస్ అవుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కొందరికి డబ్బింగ్ సెట్ అవుతుంది, కానీ కొందరు హీరోయిన్స్‌కి ఇతరులతో చెప్పించే డబ్బింగ్ అస్సలు సెట్ కాదు. అయినా కూడా తప్పని పరిస్థితుల్లో, తెలుగు రాకపోవడం వల్ల డబ్బింగ్ ఆర్టిస్ట్‌లపై ఆధారపడాల్సి వస్తుంది.సాయి పల్లవితో పాటు మరికొందరు హీరోయిన్స్ మాత్రం ఏ భాషలో సినిమా చేసినా, ఆ భాషను నేర్చుకుని మరీ డబ్బింగ్ చెప్తున్నారు. అందులో అనుపమ పరమేశ్వరన్ కూడా ముందు ఉంటుంది. ఈమె తెలుగులో చేసిన సినిమాల్లో ఎక్కువ శాతం సినిమాలకు సొంత డబ్బింగ్ చెప్పుకుంది. మొదటి సినిమా ‘అఆ’ నుంచే తాను సొంత డబ్బింగ్ మొదలు పెట్టింది, ప్రేమమ్ సినిమాలో కూడా అనుపమ్ సొంతంగా డబ్బింగ్ చెప్పుకుంది. నార్మల్ తెలుగు భాష అయితే పర్వాలేదు కానీ కాస్త యాస, అది కూడా పల్లెటూరు యాస, మాస్ జనాలు మాట్లాడుకునే ప్రాసలో మాట్లాడటం అనేది చాలా కష్టం. కానీ అనుపమ మాత్రం తన తాజా చిత్రం కోసం చాలా కష్టపడి యాసతో కూడా మాస్ భాష తో డబ్బింగ్ చెప్పింది. శర్వానంద్ హీరోగా రూపొందిన ‘భోగి’ సినిమా కోసం అనుపమ పరమేశ్వరన్ డబ్బింగ్ పూర్తి చేసింది. ఆ విషయాన్ని చిత్ర యూనిట్ సభ్యులు అధికారికంగా ప్రకటించారు. శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను కె కె రాధామోహన్ నిర్మించారు. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో అనుపమ పరమేశ్వరన్‌ను కందుల సులోచన రాణి అనే పాత్రలో చూడబోతున్నాం. ఇప్పటికే ఆమె లుక్ చూసి అంతా షాక్ అయ్యారు. తెలుగు సినిమాలో ఒక హీరోయిన్ పాత్ర మరీ ఇంత రస్టిక్‌గా ఉంటుందా అని షాక్ అయ్యారు. వీరి కాంబోలో గతంలో వచ్చిన శతమానం భవతి మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. కనుక ఈ సినిమాతో మరో విజయాన్ని ఈ కాంబినేషన్ దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. భోగి పేరు పెట్టుకుని సంక్రాంతికి ముందే రాబోతున్న ఈ సినిమాతో అనుపమ పరమేశ్వరన్ నటిగా మంచి మార్కులు దక్కించుకోవడం ఖాయం అని అంతా చాలా నమ్మకంగా చెబుతున్నారు. తాజాగా డబ్బింగ్ పూర్తి చేసిన సందర్భంగా విడుదలైన వీడియోలో చాలా మాస్‌గా అనుపమ పరమేశ్వరన్ డైలాగ్ చెప్పడం చూస్తూ ఉంటే తన కెరీర్ బెస్ట్ పెర్ఫార్మెన్స్ గా ఈ సినిమా నిలవడం ఖాయం అనిపిస్తుంది.

కంగన రీ-ఎంట్రీ వెనుక ఉన్న అసలు కథేంటి?



బాలీవుడ్ ఫైర్ బ్రాండ్.. నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి కంగనా రనౌత్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ప్రత్యక్ష తెలుగు చిత్రంలో నటించేందుకు సిద్ధమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. 17 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర దించుతూ అమ్మడు వైవిధ్యమైన టాలీవుడ్ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ సారి ఓ విభిన్నమైన జోనర్‌ను ఎంచుకుని సౌత్ ఆడియన్స్‌ను భయపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో హారర్ థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త నిర్వచనం చెప్పిన ప్రయోగాత్మక దర్శకుడు రవిబాబు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. -అవును-, -అనసూయ- వంటి చిత్రాలతో థ్రిల్లర్ చిత్రాల మేకింగ్‌లో తనదైన ముద్ర వేసుకున్న రవిబాబు.. కంగనా రనౌత్ కోసమే ఓ పవర్‌ఫుల్ హారర్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ చిత్రంలో కంగన పోషించే పాత్ర కథకు ప్రధాన బలంగా నిలవనుందని బోగట్టా. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరో ఆసక్తికర అంశం ఏంటంటే? ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే రహస్యంగా ఎలాంటి హడావుడి లేకుండా శరవేగంగా జరుగుతోందని గుసగు సలు వినిపిస్తున్నాయి. విషయం లీక్ అవ్వకుండా సస్పెన్స్‌ను మైంటైన్ చేస్తూ మేకర్స్ చిత్రీకరణను శర వేగంగా పూర్తి చేసే పనిలో పడ్డారని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను విడుదల చేయడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోంది. గతంలో కంగనా రనౌత్ టాలీవుడ్‌లో నటించిన చిత్రం -ఏక్ నిరంజన్-. 2009లో పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ సరసన కథానాయికగా నటించారు. అటుపై -తలైవి-, -చంద్రముఖి 2- వంటి పాన్-ఇండియా చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించినా? అవి తమిళ డబ్బింగ్ చిత్రాలుగానే వచ్చాయి. దాదాపు 17 ఏళ్ల సుదీర్ఘ వ్యవధి తర్వాత నేరుగా తెలుగు సినిమాలో నటించడం ఇదే తొలిసారి. విలక్షణ నటనకు మారుపేరైన కంగనా రనౌత్ హారర్ , మైండ్ థ్రిల్లర్ జోనర్‌లను హ్యాండిల్ చేయడంలో సిద్ధహస్తుడైన రవిబాబు కాంబినేషన్ కుదరడం సినీ ప్రియ-ులో ఆసక్తిని రేకెత్తిస్తోంది. నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకోవడంలో కంగనా చూపించే శ్రద్ధ తెలిసిందే. అలాంటి నటిని రవిబాబు హారర్ ఫ్రేమ్‌లో ఎలా చూపించబోతున్నారనేది ఆసక్తికర చర్చగా మారింది. మరి ఈ ప్రచారమంతా నిజమా? అన్నది కూడా కన్ఫమ్ అవ్వాలి.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA